ప్రజాశక్తి
మంగళవారం 15 ఆగస్టు 2023 పేజీలు 16





కర్నూలు నంద్యాల

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు

సర్వం సిద్ధం...

- హాజరుకానున్న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బుగ్గన
- విద్యుత్ దీపాలతో ప్రభుత్వ కార్యాలయాలు
- ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు



స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సిద్ధమైన కొండారెడ్డి బురుజు

77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. ప్రభుత్వ కార్యాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

వార్త 2లో

స్వాతంత్ర్యోద్యమ ఖిల్లా కందనవోలు

రాయలసీమ ముఖ ద్వారంగా పేరొందిన కందనవోలు.. తొలి స్వాతంత్ర్యోద్యమ ఖిల్లాగా చరిత్రకెక్కింది. స్వాతంత్ర్యోద్యమానికి నాందిగా భావిస్తున్న సిపాయిల తిరుగుబాటుకు ముందే కర్నూలు జిల్లాలో తెల్లదొరలపై ఉద్యమానికి బీజం పడింది. 1801లోనే తిరుగుబాటు ప్రారంభమైంది. తెల్లదొరల దాస్య శృంఖలాల నుంచి మాతృభూమిని విడిపించేందుకు సమర యోధులు అవిశ్రాంత పోరాటం చేశారు. జైలు శిక్షలకు వెరవక ఉద్యమమే ఊపిరిగా సాగారు. వందేమాతరం అంటూ ఉప్పెనై కదిలి బ్రిటీష్ పాలకులను గజగజ వణికించారు. తుపాకీ తూటాలను సైతం లెక్క చేయక స్వాతంత్ర్యమే లక్ష్యంగా కదం తొక్కారు. ఈ పోరాటంలో కందనవోలు ప్రజలు చురుకైన పాత్ర పోషించారు. వారిలో కొద్దిమంది గాథలు ఇప్పటికీ ప్రజల నోళ్లలో నానుతున్నాయి. వారి స్వాతంత్ర్య స్ఫూర్తి నలు దిశలా వ్యాపించింది..

- పోరాటంలో జిల్లా వాసుల కీలక పాత్ర
- 1801లోనే తిరుగుబాటు
- నేడు స్వాతంత్ర్య దినోత్సవం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

మహాత్ముడు నడయాడిన నేల : స్వాతంత్ర్యోద్యమ కాలంలో జాతిపిత గాంధీ ప్రసంగం ఆదోని ప్రజల్లో స్ఫూర్తిని నింపింది. 1926లో అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం ఉప్పుపై పన్ను విధించింది. ఇందుకు నిరసనగా గాంధీజీ పాదయాత్ర చేపట్టి దేశ ప్రజలందరినీ ఒక్క తాటిపైకి తెచ్చేందుకు యత్నించారు. ఇందులో భాగంగానే ఆయన 1930 సెప్టెంబర్ 30న కర్ణాటకలోని సండూరులో జరిగిన బహిరంగ సభలో పాల్గొని అనంతరం రైలులో ఆదోనికి చేరుకున్నారు. స్థానిక మున్సిపల్ మైదానంలో జరిగిన బహిరంగ సభలో జాతిపిత ఉద్వేగంగా హిందీలో ప్రసంగించారు. ఆదోని పట్టణానికి చెందిన చున్నీలాల్ జయచంద్ సోనో ఆయన ప్రసంగాన్ని తెలుగులో అనువదించారు. గాంధీజీ ఉద్వేగ పూరితంగా చేసిన ప్రసంగం స్థానికంగా ప్రజల్లో స్వాతంత్ర్య సమర స్ఫూర్తిని నింపింది. స్వాతంత్ర్య పోరాటంలో గాంధీ పత్తికొండలోనూ పర్యటించారు. 1929 మే1న పత్తికొండకు వచ్చారు. అదే ఏడాది మే 21న గాంధీ తన సతీమణి కస్తూరితో కలిసి ఖద్దరు ఉద్యమ ప్రచారంలో భాగంగా చాగలమర్రికి

వార్త 2లో


పరామర్శిస్తున్న సిఐటియు నాయకులు

విద్యుత్ కార్మికుల అక్రమ అరెస్టులు సిగ్గుచేటు

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

విద్యుత్ కార్మికులను అక్రమంగా అరెస్టు చేయడం దారుణమని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్.డి.అంజిబాబు విమర్శించారు. సోమవారం ఎమ్మిగనూరు రూరల్ పోలీసు స్టేషన్‌లో ఉన్న ఖండించారు. యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) జిల్లా నాయకులు భీమేష్‌ను అంజిబాబు, సిఐటియు నాయకులు సి.గోవిందు, రాముడు, రైతు సంఘం నాయకులు హనుమంతు పరామర్శించారు. ఈ సందర్భంగా అంజిబాబు మాట్లాడారు. విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 17న 'చలో విజయవాడ' చేపడుతుండగా సోమవారం నుంచే అరెస్టులు చేయడం సిగ్గుచేటని తెలిపారు. యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) జిల్లా నాయకులు భీమేష్‌ను ఎమ్మిగనూరులో అరెస్టు చేసి రూరల్ పోలీసు స్టేషన్‌లో ఉంచారని చెప్పారు. ఎలక్ట్రిసిటీ ఉద్యోగులు న్యాయమైన డిమాండ్ల కోసం ఆందోళన చేస్తుంటే ప్రభుత్వం ఉద్యోగులు, కార్మికులను అరెస్టులు చేసి ఉద్యమాలను అణిచివేయాలని చూస్తోందని తెలిపారు. ప్రజాస్వామ్య దేశంలో నిరసనను తెలియజేసే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందన్నారు. ప్రభుత్వం విద్యుత్ ఉద్యోగులు, కార్మికుల డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని మాత్రమే ఉద్యోగులు ఆందోళన చేస్తున్నారని తెలిపారు. వారు చేస్తున్న పోరాటానికి సిఐటియు ఎల్లవేళలా అండ ఉంటుందని చెప్పారు.

గ్రంథాలయం ఆధ్వర్యంలో ఆటలపోటీలు

- గ్రంథాలయ అధికారి వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-ఆలూరు

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, ఆటలపోటీలు నిర్వహించినట్లు ఆలూరు గ్రంథాలయ అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం ప్రయివేట్ ఘాజీ పబ్లిక్ స్కూల్‌లో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, ఆటల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు నేడు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు.

పైసా లేనిదే.. ఫైల్ కదలదు..!

- ప్రతి ధ్రువీకరణ పత్రానికీ ఒక రేటు - పత్రాన్ని బట్టి రూ.10 వేల వరకు వసూలు

- సామాన్యుని పట్టి పీడిస్తున్న రెవెన్యూ అధికారులు

- నందవరం తహశీల్దార్ కార్యాలయంలో తంతు...

ప్రజాశక్తి - నందవరం

అవినీతి రహిత పాలన అందిస్తున్నామని సాక్షాత్తు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆర్భాటంగా చెబుతున్నారు. మండల స్థాయిలో మాత్రం అవినీతిని అరికట్టడంలో జిల్లాస్థాయి అధికారులు విఫలం చెందారు. ప్రతి పనికీ ఒక్కో రేటును నిర్ణయించి రెవెన్యూ అధికారులు సొమ్ము చేసుకుంటున్నారు.


నందవరం తహశీల్దార్ కార్యాలయం

నందవరం తహశీల్దార్ కార్యాలయంలో ఒక్కో అధికారి ఒక్కో ధ్రువీకరణ పత్రానికి ఒక్కో రేటును నిర్ణయించి అవినీతి పాల్పడుతూ సొమ్ము చేసుకుంటున్నారు. రెవెన్యూ అధికారులు ఒక కుటుంబ ధ్రువీకరణ పత్రానికి రూ.2 వేల నుంచి రూ.5 వేల వరకు వసూలు చేస్తున్నారు. ఇంటి పొజిషన్ పత్రానికి రూ.3 వేల నుంచి రూ.10 వేల వరకు, సాగునీటి బోరు మంజూరుకు వ్యక్తిని బట్టి రూ.2 వేల నుంచి రూ.5 వేలు, పాత జనన, మరణ ధ్రువీకరణ పత్రాలను సంవత్సరాలను బట్టి రూ.వెయ్యి నుంచి రూ.2 వేలు వసూలు చేస్తున్నారు. అలాగే పాత ఇంటి పట్టాలు పోతే వాటి డూప్లికెట్ పట్టాలను రూ.వెయ్యి, భూమి కొలతల కోసం గ్రామ సర్వేయర్ ఇచ్చే ఎంజాయ్‌మెంట్ పత్రానికి ఎకరాలను బట్టి రూ.5 వేలకు తక్కువ కాకుండా వసూలు చేస్తున్నారు. ఇదేమని బాధితులు అడిగితే 'నీకేం తెలుసు. మేమంటే. ఆర్ఐ, డిప్యూటీ తహశీల్దార్, తహశీల్దార్‌కు పర్సెంటేజీలు ఇవ్వాలి. లేకపోతే మీ పనులు జరగవ'ని అధికారులు బహిరంగంగానే చెబుతున్నారు. ఒకవేళ వారు అడిగిన డబ్బులు ఇవ్వకపోయినా, డబ్బుల గురించి స్పందించకపోయినా ఆ దరఖాస్తులను నెలల తరబడి వెనకేస్తూ 'ఈరోజు, రేపు' అంటూ ప్రజలను కార్యాలయాలు చుట్టూ తిప్పుకుంటున్నారు. వారు డబ్బులు ఇచ్చేంత వరకు ధ్రువపత్రాలను మంజూరు చేయకుండా కాలయాపన చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చెబుతున్న అవినీతి రహిత పాలనకు మండల అధికారులపై చర్యలు తీసుకుంటారో లేదో చూడాలి మరి.



కార్యాలయంలో జరుగుతున్న అవినీతిపై తహశీల్దార్ నిత్యానంద రాజును సంప్రందించగా... ఎవరైనా పనుల కోసం డబ్బులు అడిగితే తన దృష్టికి తీసుకొస్తే వారిపై చర్యలు తీసుకుంటానని తెలిపారు. ప్రజలకు సేవలు అందించడం మన బాధ్యత అని అన్నారు.

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సర్వం సిద్ధం...

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

77వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. ప్రభుత్వ కార్యాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. కర్నూలు నగరంలోని పోలీస్ పరేడ్ మైదానంలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పరేడ్‌మైదానంలో జాతీయ పతాకాన్ని జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఎగురవేస్తారు. అనంతరం పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించి జిల్లా ప్రజలనుద్దేశించి మాట్లాడతారు. ఈ సందర్భంగా పరేడ్ మైదానంలో ఆయా ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన స్టాల్స్ ఏర్పాటు చేశారు. ప్రభుత్వ శాఖల శాఖటాల ప్రదర్శన కూడా జరగనుంది. విద్యాశాఖ ఆధ్వర్యంలో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నారు. ఆయా ప్రభుత్వ శాఖల్లో పని చేసే అధికారులకు ఉద్యోగులకు ఉత్తమ సేవా పురస్కారాలలో భాగంగా ప్రశంస పత్రాలను అందజేస్తారు. పోలీస్ పరేడ్ మైదానాన్ని ఎంతో సుందరంగా విద్యుత్తు దీపాలతో అలంకరించారు. మైదానంలో కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

స్వాతంత్ర్యోద్యమ ఖిల్లా కందనవోలు

విచ్చేశారు. కేరళ ఆస్పత్రిలోని ముందు గదిలో కాసేపు విశ్రాంతి తీసుకున్నారు. అక్కడి నుంచి ఊరేగింపుగా వచ్చి అమ్మవారిశాల వెనుకబాగాన కళ్యాణమండపం కట్టిన ప్రదేశంలో ప్రసంగించారు. 1940లో గాంధీ ఆధ్వర్యంలో జరిగిన సత్యాగ్రహంలో చాగలమర్రి వాసులు పాల్గొన్నారు.

పోరాట గ్రామం..తెర్నేకల్ : జిల్లాలో 1801లోనే బ్రిటీష్ వారిపై తిరుగుబాటు బావుటా ఎగరవేశారు తెర్నేకల్ వాసులు. ఈ గ్రామం ప్రథమ స్వాతంత్ర్య పోరుగల్లుగా నిలిచింది. ఈ పోరాటాన్ని నేటికీ జానపదులు గానం చేస్తూ స్మరించుకుంటారు. 1801లో కరువు కాటకాలకు గురైన తెర్నేకల్ రైతుల తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొనేవారు. బ్రిటీష్ దొర థాకరే రైతులపై పన్ను విధించారు. గ్రామ నాయకుడు ముత్తుకూరు గౌడప్ప మరికొందరి రైతులను కూడగట్టుకుని పన్ను కట్టేది లేదని వారిని ఎదురించాడు. థాకరే భారీ సైన్యం మందుగుండు సామగ్రితో తెర్నేకల్‌పై దాడి చేశాడు. గౌడప్పకు తోడుగా అదే గ్రామానికి చెందిన అప్పటి నాయకురాలు రెడ్డెక్కమ్మ కూడా బ్రిటీష్ సైన్యంతో పోరాటం సాగించింది. గౌడప్పతో పాటు ఆ గ్రామ రైతులు బలయ్యారు. భర్తలను కోల్పోయిన కొంతమంది స్త్రీలు ఆత్మహత్య చేసుకున్నారు. బ్రిటీష్ సైన్యం మృతదేహాలను గ్రామంలో ఉన్న కుక్కల బావిలో కుప్పలుగా పోశారు.


ఉయ్యాలవాడ నరసింహారెడ్డి

రేనాటి సూర్యుడు...నరసింహారెడ్డి : తెల్లదొరల గుండెల్లో సింహ స్వప్నంగా నిలిచారు రేనాటి సూర్యుడు, విప్లవ వీరుడు ఉయ్యాలవాడ వీర నరసింహారెడ్డి. ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన సీతమ్మ, పెద్దమల్లారెడ్డి దంపతులకు ఆయన జన్మించారు. అప్పట్లో నొస్సం ప్రధాన కేంద్రంగా బ్రిటీష్ పాలన కొనసాగేది. నరసింహారెడ్డి తాత జయరామిరెడ్డికి పన్నులు, భూమిశిస్తు వసూలు చేసే అధికారం అప్పగించారు. ఆయన మరణానంతరం వారసత్వంగా ఈ బాధ్యత నరసింహారెడ్డికి వచ్చింది. బ్రిటీష్ నిరంకుశత్వ పాలనకు ప్రతిఘటించి 1842వ సంవత్సరంలోనే వారిపై తిరుగు బాటు బావుటా ఎగురవేశాడు. తన పోరాటంలో కోవెలకుంట్ల తహసీల్దార్‌ను నరికి చంపడమే కాక బ్రిటీష్ వారి ఖజానాను అంతా కొల్లగొట్టారు. ఈయన విప్లవ మార్గానికి వణికిపోయిన బ్రిటీష్‌వారు ఆయనను పట్టించిన వారికి 10 వేల దినారాలు బహుమతి అందజేస్తామని ప్రకటించారు. 1847లో సంజామల మండలం జగన్నాథ గుట్టపై నరసింహారెడ్డిని ప్రాణాలతో పట్టుకుని బందిపోటు దొంగగా ముద్రవేశారు. 1847 ఫిబ్రవరి 22వ తేదీన కోవెలకుంట్ల సమీపంలో గల జుర్రేరు ఒడ్డున ఉరి తీశారు.

ఉద్యోగం వదిలి 'నివర్తి' పోరు : పత్తికొండకు చెందిన నివర్తి వెంకటసుబ్బయ్య నంద్యాలకు వలస వచ్చారు. తాలూకా ఆఫీసులోని ఉద్యోగానికి రాజీనామా చేసి స్వాతంత్ర్యోద్యమ బాట పట్టారు. వ్యక్తి సత్యాగ్రహంలో పాల్గొన్న నివర్తిని, 140 మంది సహచరులను అక్టోబర్ 14, 1940లో ప్రభుత్వం అరెస్ట్ చేసి 8 నెలలు జైలు శిక్ష వేసింది. జైలు నుంచి బయటకు రాగానే మళ్లీ ఉద్యమంలోకి వెళ్లారు. విద్యార్థులతో కాంగ్రెస్ సభ్యులతో రహస్య దళాలను ఏర్పాటు చేశారు. 1942లో విప్లవోద్యమాన్ని నడిపించడానికి విధి విధానాలను నిర్దేశిస్తూ ఆయన రూపొందించిన సర్క్యులర్‌ను బ్రిటీష్ ప్రభుత్వం నిషేధించింది. ఆయనను అరెస్టు చేయడానికి ప్రయత్నించడంతో అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. తర్వాత గాంధీజీ సలహా మేరకు ఆయన లొంగిపోయారు. స్వాతంత్ర్యం వచ్చాక 1968 నుంచి 78 వరకు ఈయన శాసనమండలి అధ్యక్షునిగా పనిచేశారు.

ఆదర్శ వనిత పద్మావతమ్మ : స్వాతంత్ర్య ఉద్యమంలో ఆస్తిని విరాళంగా ఇవ్వడమే కాకుండా పోరాటాన్ని జరిపిన ఏకైక మహిళగా పద్మావతమ్మ ఆదర్శంగా నిలిచారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఇచ్చిన పిలుపు మేరకు బ్రిటీష్ ప్రభుత్వంలో పోలీస్‌గా పనిచేసిన శ్యాముల్ బెనెటిక్ట్ ఆజాద్ హింద్ ఫౌజ్‌లో చేరారు. నంద్యాలకు ప్రాంతానికిచెందిన దేశాయి కప్పురావు, కోడి నరసింహం, ఆత్మకూరు నాగభూషణం శెట్టి, ఎర్రబోలు సుబ్బారెడ్డి, యాతం మహానందిరెడ్డి, రాజా శ్రీనివాస్‌లు స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారు.


గులాం రసూల్ ఖాన్

ఉద్యమ స్వప్నం..గులాం రసూల్ ఖాన్ : కర్నూలు చివరి నవాబు గులాం రసూల్ ఖాన్ బ్రిటీష్ దొరల పెత్తనంపై పెనుతుపానై ఎగిశాడు. తన అనుచరులందరినీ వెంటబెట్టుకొని వెళ్లి కర్నూలు సమీపంలోని జొహరాపురం కేంద్రంగా ఉద్యమం ప్రారంభించారు. 1839లో వహాబీ ఉద్యమ నేతలతో సంబంధాలు పెట్టుకుని ఉద్యమాన్ని మరింత ఉధృతం చేశారు. ఇప్పటికీ కర్నూలు కిడ్స్ వరల్డ్‌లో కనిపిస్తున్న ఫిరంగి గులాం రసూల్ ఖాన్ కాలం నాటిదే. హంద్రీ నదీ తీరంలో గులాం రసూల్ ఖాన్ మర ఫిరంగులను పేలుస్తూ వేలాది బ్రిటీష్ దొరలను హతమార్చారు. బ్రిటీష్ సైన్యం గులాం రసూల్ ఖాన్‌ను బంధించి తిరుచునాపల్లి జైలుకు తరలించింది. ఆయనపై విష ప్రయోగం చేసి నిర్దాక్షిణ్యంగా హతమార్చింది.

ఇసుక బకాసురుడు..!

- అక్రమ ఇసుక దందా చేస్తున్న వైసిపి నాయకుడు
- రోజుకు రూ.లక్షల్లో ఆదాయం
- మామూళ్ల మత్తులో

ప్రజాశక్తి - హోళగుంద

వేదవతి నది అడ్డాగా ఇసుక బకాసురులు రూ.లక్షల్లో సంపాదిస్తున్నారు. అధికారులు మామూళ్ల మత్తులో మునిగి తేలుతున్నారు. కర్ణాటక సరిహద్దు హోళగుంద మండలంలోని మార్లమడికి గ్రామ సమీపంలో వేదవతి నది ప్రవహిస్తోంది. గతంలో ఇక్కడ ప్రభుత్వం ఇసుక రీచ్‌ను ఏర్పాటు చేసింది. ప్రస్తుతం ఇక్కడ ప్రభుత్వం ఎలాంటి వ్యాపారమూ నిర్వహించడం లేదు. ప్రభుత్వ భవన నిర్మాణాలకు, జగనన్న ఇళ్ల నిర్మాణ లబ్ధిదారులకు మాత్రమే సంబంధిత అధికారుల అనుమతి మేరకే ట్రాక్టర్ల ద్వారా రవాణా చేసుకునే వెసలుబాటు కల్పించింది. కొంతమంది అధికార పార్టీ నాయకులు ప్రభుత్వ ఆదేశాలను బేఖాతరు చేస్తూ ఇసుకను అక్రమంగా విచ్చలవిడిగా రవాణా చేస్తూ రూ.కోట్లు సంపాదిస్తున్నారు.



ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్న ఇసుక

ఇసుక బకాసురుడు

మండలంలోని నాగరకనివి గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు నాగిరెడ్డి వేదవతి నదిలో ఇసుక అక్రమంగా తరలిస్తూ రూ.లక్షలు సంపాదిస్తున్నారు. ఈ తతంగమంతా గత కొంతకాలంగా కొనసాగుతూనే ఉంది. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో వర్షాలు ఎక్కువై నదిలో నీటి ప్రవాహం పెరిగితే ఇసుకను తీసేందుకు ఇబ్బంది అవుతుందని భావించి ముందు చూపుతో దాదాపు 400 ట్రిప్పుల ట్రాక్టర్ల ఇసుకను డంపు చేశారు. ప్రస్తుతం ఇసుక రూ.3 వేలు పలుకుతోంది. అధిక వర్షాలు కురిసి వేదవతి నదిలో నీటి ప్రవాహం పెరిగినప్పుడు డిమాండ్‌ను బట్టి రూ.4 వేల నుంచి రూ.6 వేల దాకా అమ్ముకోవచ్చని భావించి దాదాపు రూ.50 లక్షల విలువ గల ఇసుకను డంపు చేసిన నిల్వ ఉంచారు. రోజుకు రూ.వేలలో ఆయన ఆదాయం ఉంటుందని విమర్శలు ఉన్నాయి.

మామూళ్ల మత్తులో అధికారులు

అధికారుల కళ్లెదుట అక్రమ ఇసుక రవాణా జరుగుతున్నా మామూళ్ల మత్తులో చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నట్లు సమాచారం. ఇసుక అక్రమ రవాణా చేసేది కొంతమంది అధికార పార్టీ నాయకులు కావడం గమనార్హం. తామేం చేయలేకపోతున్నామని కొంతమంది అధికారులు బాహాటంగానే చెబుతున్నారు. అధికార, అంగబలంతో నాయకులు ఇంత చేస్తున్నా అధికారులు కిమ్మనక కూర్చోవాల్సిందేనని మండల ప్రజలు మండిపడుతున్నారు. జిల్లా అధికారులు స్పందించి ఇసుక అక్రమ డంపింగ్ చేసిన వారిపై చర్యలు తీసుకొని ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని కోరుతున్నారు.



అక్రమంగా డంప్ చేసిన ఇసుక

గ్రామాలాభివృద్ధి గాలికి...

- గ్రామాభివృద్ధికి విలేజ్ మేనిఫెస్టో - మాజీ ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - గోనెగండ్ల

రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిని గాలికి వదిలేసిందని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వరరెడ్డి విమర్శించారు. సోమవారం గోనెగండ్ల మండలంలో ఆయన చేపట్టిన పల్లెనిద్ర కార్యక్రమం 5వ రోజుకు చేరుకుంది. మొదటిరోజు పెద్దనేలటూరు గ్రామంతో ప్రారంభించిన ఆయన రెండో రోజు కున్నూరు గ్రామంలో చేపట్టారు. మూడోరోజు లింగందిన్నె, నాలుగో రోజు వీరంపల్లి గ్రామంలో రాత్రి బస చేశారు. సోమవారం సాయంత్రం ఎర్రబాడు గ్రామానికి చేరుకొని రాత్రి అక్కడే బస చేయనున్నారు. సోమవారం ఉదయం వీరంపల్లి గ్రామంలో రైతులతో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. అలాగే గ్రామంలో వీధులన్నీ తిరిగి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుని మహిళలతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలు గ్రామాల్లో తాగడానికి నీరు దొరకక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అలాగే సరైన రోడ్లు, మురుగునీటి కాలువలు లేక గ్రామాలు గుంతలు, బురదమయంగా ఉన్నాయని చెప్పారు. గత టిడిపి హయాంలో నియోజకవర్గంలోని మూడు మండలాల్లో 75 గ్రామాలకు తాగునీరందించాలని రూ.146 కోట్లతో వాటర్ గ్రిడ్ పథకాన్ని తెచ్చామన్నారు. గోనెగండ్ల మండలంలో 11 గ్రామాలకు తాగునీటి సౌకర్యం కల్పించే విధంగా రూ.13.5 కోట్లతో పథకాన్ని ప్రారంభించామని తెలిపారు. 60 శాతం పనులు పూర్తి చేస్తే అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం మిగిలిన పనులను పూర్తి చేయలేదని విమర్శించారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలైన తాగునీరు, పారిశుధ్యం వసతులు కల్పించకుండా గ్రామాల అభివృద్ధిని గాలికి వదిలేసిందని తెలిపారు. రానున్న ఎన్నికల్లో టిడిపిని గెలిపిస్తే గతంలో తాము మంజూరు చేసిన పథకాలన్నీ పూర్తి చేసి గ్రామాల్లో ప్రజలకు అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తామని హామీఇచ్చారు.

విలేజ్ మేనిఫెస్టో విడుదల

రాష్ట్రవ్యాప్తంగా అధికారంలోకి వస్తే టిడిపి ప్రవేశపెట్టనున్న పథకాలకు సంబంధించి రాష్ట్రవ్యాప్త మేనిఫెస్టోతో పాటు నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధికి ప్రత్యేకంగా విలేజ్ మేనిఫెస్టోను తయారు చేస్తున్నామని బీవీ తెలిపారు. ముఖ్యంగా ఆయా గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న తాగు, సాగునీటి సమస్య, రైతులకు ధరలు లేనప్పుడు పండించిన పంటలను నిల్వ ఉంచుకుని ధర బాగున్నప్పుడు అమ్ముకునే విధంగా కోల్డ్ స్టోరేజీ నిర్మాణం, వ్యవసాయానికి రెండు విడతల పగటిపూట విద్యుత్, కల్తీ విత్తనాల నియంత్రణ, గ్రామాల్లో సిసి రోడ్లు, డ్రెయినేజీల ఏర్పాటు లాంటి అంశాలను గుర్తించి విలేజ్ మేనిఫెస్టోలో పొందుపరచనున్నట్లు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే వాటిని అమలుపరుస్తామని అన్నారు. అనంతరం ఎర్రబాడు గ్రామానికి చేరుకుని రాత్రి గ్రామంలోనే నిద్రించారు. టిడిపి నాయకులు వీరంపల్లి సంజీవయ్య ఆచార్యులు, రామ సుంకన్న, శ్రీనివాసులు, తిరుపతయ్య నాయుడు, లింగందిన్నె నాయుడు, పూజారి చంద్రశేఖర్, మదీనా, కులుమాల రాముడు, చాంద్ బాష, మునిస్వామి పాల్గొన్నారు.



తాగునీటి సమస్య తెలుసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే బీవీ

ప్రభుత్వ డిగ్రీ, ఐటిఐ కళాశాలల భవనాలు నిర్మించాలి

- తహశీల్దార్‌కు ఎస్ఎఫ్ఐ వినతి

ప్రజాశక్తి-ఆలూరు

ఆలూరులో ఉన్న ప్రభుత్వ డిగ్రీ, ఐటిఐ కళాశాలలకు నిధులు కేటాయించి భవనాలు నిర్మించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. సోమవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో స్పందనలో తహశీల్దార్ రామాంజనేయులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు పోతురాజు మాట్లాడారు. ఆలూరులో ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు 1987 ఆలూరులోని హత్తిబెళగల్ రోడ్డు మార్గంలో స్థలం కేటాయించారని తెలిపారు. సొంత భవనాలు నిర్మించడంలో ప్రభుత్వాలు, స్థానిక పాలకులు విఫలం చెందారని విమర్శించారు. ప్రస్తుత డిగ్రీ కళాశాల ప్రభుత్వ బాయ్స్-2 పాఠశాలలోనే విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ ఐటిఐ కళాశాలను 2008లో కళాశాల ఏర్పాటు చేస్తే నేటి వరకు సొంత భవనాలు లేవని తెలిపారు. ప్రభుత్వ పాలకుల పాలన ఎలా ఉందో అర్థమవుతుందని విమర్శించారు. ఐటిఐ కళాశాల బాయ్స్-1 హైస్కూల్‌లో పురాతన భవనాల్లో భయం గుప్పెట్లో విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని తెలిపారు. విద్యార్థి, యువజన సంఘాలు అనేక దఫాలు పోరాటాలు, ఉద్యమాలు చేస్తే 2019లో ఐటిఐ కళాశాలకు అగ్రహారం గ్రామం దగ్గర స్థలం కేటాయించారని చెప్పారు. హద్దులు చూపించలేదన్నారు. డిగ్రీ కళాశాలలో అదనపు బి.కామ్ కప్యూటర్, బీఎస్సీ, బిజెడ్‌సి గ్రూపులు ఏర్పాటు చేయాలని కోరారు. ఎస్ఎఫ్ఐ మండల ఉపాధ్యక్షులు ఉలిరాజు, ధనుంజయ, గిరిమూర్తి, సహాయ కార్యదర్శి పరమేష్, మధు, లింగమూర్తి, మల్లారెడ్డి, గాదిలింగ, శివశంకర్, శివరాజు, మల్లి, ప్రవీణ్ పాల్గొన్నారు.



తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సమస్యలకు సత్వర పరిష్కారం చూపండి

- సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్

ప్రజాశక్తి - ఆదోని

స్పందన అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలని ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అధికారులకు సూచించారు. సోమవారం స్పందనలో డివిజన్‌లోని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామస్థాయిలో పరిష్కారమయ్యే సమస్యలు డివిజన్ స్థాయి వరకు రాకుండా చూసుకోవాలన్నారు. గడువులోపు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్ఎల్ఎలోకి వెళ్లకుండా చూడాలన్నారు. పరిపాలనాధికారి గోవింద్ సింగ్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణు సూర్య, డిఎల్‌డిఓ నాగేశ్వరరావు, డిఎల్‌పిఓ నూర్జహాన్, గృహ నిర్మాణ శాఖ డిప్యూటీ ఇంజినీరు రవికుమార్, వ్యవసాయ శాఖ ఎడిఎ గిరీష్ కుమార్ రెడ్డి, ఆర్‌టిసి డిఎం మహ్మద్ రఫీ, డిప్యూటీ తహశీల్దార్ వలిబాష, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆజాదీకా అమృత్ మహోత్సవ ర్యాలీ

ప్రజాశక్తి- దేవనకొండ

ఆజాదీకా అమృత్ మహోత్సవంలో దేవనకొండలో యువకులు, మేధావులు, అన్ని ప్రయివేట్ పాఠశాలల విద్యార్థుల ఆధ్వర్యంలో భాగంగా సోమవారం ర్యాలీ నిర్వహించారు. కర్నూలు జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ సభ్యులు శాంతికుమార్, విశ్రాంతి ఉపాధ్యాయులు ఉచ్చీరప్ప, బొడ రవి, సైనికులు రామాంజి, రఫీ, ప్రయివేట్ విద్యాసంస్థల నిర్వాహకులు కృష్ణమూర్తి, రఘు, సుభాన్, జగదీష్, సుధాకర్, అల్లీపీరా పాల్గొన్నారు. మాట్లాడారు. 76వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 'హర్ ఘర్ తిరంగా' నినాదంతో ప్రతి ఇంటిపైనా జాతీయ జెండాను ఎగురవేయాలని తెలిపారు. స్వాతంత్ర్య సమర యోధులను స్మరించుకోవాలని, ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. యువకులు రాజు, చిన్నారెడ్డి, రాజశేఖర్, సాయి, చాంద్ బాషా, శివ



మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు

ఎండార్స్‌మెంట్ తప్పనిసరి

- కలెక్టర్ డాక్టర్ సృజన



బాధితుల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ డాక్టర్ సృజన

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

జగనన్నకు చెబుదాం - స్పందన కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలకు తప్పనిసరిగా ఎండార్స్‌మెంట్ అందజేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక 'జగనన్నకు చెబుదాం-స్పందన'కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన వినతులను కలెక్టర్ , జెసి నారపురెడ్డి మౌర్య అర్జీలను స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ మండల స్థాయిలో ఎక్కువ శాతం స్పందన అర్జీలకు సంబంధించిన ఎండార్స్‌మెంట్లను కేవలం వారి మొబైల్ ఫోన్లకు సదరు సమస్య పరిష్కారం అయిందన్న విషయాన్ని తెలియజేస్తున్నారని అలా కాకుండా జిల్లా మండల స్థాయి అధికారులు అర్జీదారులకు ఇచ్చే ఎండార్స్‌మెంటును వారి కార్యాలయల వద్దకు పిలిపించి వారి చేతికి అందజేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా, మండల స్థాయి అధికారులను ఆదేశించారు. దీని వల్ల అర్జీదారులలో సంతృప్తి స్థాయి పెరిగే అవకాశం ఉంటుందన్నారు. అర్జీదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. అర్జీదారుడు సంతప్తిచెందేలా నిర్ణీత గడువులోపు అర్జీలను తప్పనిసరిగా పరిష్కరించాలని ఆదేశించారు. పెండింగ్ దరఖాస్తులు, బియాండ్ ఎస్ఎల్ఎ లోకి వెళ్లకుండా వచ్చిన దరఖాస్తులు మళ్లీ రీఓపెనింగ్ కాకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను నాణ్యతతో పరిష్కరించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా వివిధ సమస్యలను అర్జీదారులు వినతులను సమర్పించారు. డిఆర్ఓ నాగేశ్వరరావు, జడ్‌పి సిఇఒ నాసర రెడ్డి, సిపిఒ అప్పలకొండ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు అనురాధ, నాగప్రసన్న లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం కోసమే 'గడపగడపకు'

- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్

ప్రజాశక్తి - హాలహర్వి

ప్రజా సంక్షేమం కోసమే 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్ తెలిపారు. సోమవారం మండలంలోని బేవినహాల్ గ్రామంలో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. మంత్రి జయరామ్ ముఖ్య అతిథిగా హాజరయి మాట్లాడారు. ముఖ్యమంత్రి దృఢ సంకల్పంతో రాష్ట్రాభివృద్ధి కోసం 'గడపగడపకు మన ప్రభుత్వం' ప్రవేశపెట్టినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు ఏయే స్థాయిలో, ఏయే వర్గాలకు అందుతున్నాయో, ఏమాత్రం అందుతున్నాయోనని మంత్రి ఆరా తీశారు. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల అభివృద్ధి కోసం నాడు-నేడు కింద నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. గ్రామానికి తాగునీటి కోసం జలజీవన్ మిషన్ కింద తాగునీరు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. వైసిపి ఇన్‌ఛార్జీ నారాయణస్వామి, ఎంపిపి నెట్టి కంటమ్మ, జడ్‌పిటిసి లింగప్ప, మండల కన్వీనర్ భీమప్ప చౌదరి, వైస్ ఎంపిపి నాగేష్, ఎంపిడిఒ ఆంథోని పాల్గొన్నారు.



పథకాలను వివరిస్తున్న మంత్రి జయరామ్

హాలహర్విలో 7వ వార్డు ఏకగ్రీవం

ప్రజాశక్తి - నందవరం

మండలంలోని హాలహర్వి 7వ వార్డుకు మద్రి జయమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయినట్లు ఎన్నికల అధికారి రఘునాథ్ సోమవారం తెలిపారు. నామినేషన్ల స్వీకరణ నుంచి మద్రి జయమ్మ ఒక్కరే నామినేషన్ వేసినట్లు చెప్పారు. ఆమె ఏకగ్రీవంగా ఎన్నికయినట్లు అధికారులు ధ్రువీకరణ పత్రాన్ని అందించారు. మద్రి జయమ్మ భర్త మరణించడంతో ఆమె 7వ వార్డుకు నామినేషన్ వేయడంతో అన్ని పార్టీల నాయకులు ఎవరూ పోటీకి నిలబెట్టలేదు. ఆమె ఏకగ్రీవంగా ఎన్నికయినట్లు అధికారులు తెలిపారు.



ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారి

బాబు, పవన్ మాటలు నమ్మొద్దు

- ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి - ఆదోని

అధికార దాహం కోసం మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, జనసేన నాయకులు పవన్ కల్యాణ్ పాకులాడుతున్నారని, వారి మాటలు నమ్మవద్దని ఎమ్మెల్యే వై.సాయి ప్రసాద్ రెడ్డి ప్రజలను కోరారు. సోమవారం ఆదోనిలోని 42వ వార్డు హనుమాన్ నగర్‌లో కౌన్సిలర్ లోకేశ్వరి, సీనియర్ నాయకులు స్టోర్ నాగరాజు ఆధ్వర్యంలో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. వారు ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. వీధి దీపాల సమస్యలు, రోడ్లు, మురుగు కాలువలను పరిశీలిస్తూ వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలిస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. బాబుకు దత్తపుత్రుడైన పవన్ కల్యాణ్ రాష్ట్రంలో అరాచకం సృష్టిస్తూ ప్రజలను, అధికారులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ వారిని ఇంటికి పంపి జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేయడం ఖాయమన్నారు. నేడు రాష్ట్ర ప్రజలకు మంచి చేయాలంటే రాక్షసులతో యుద్ధం చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. గత టిడిపి ప్రభుత్వం ప్రజలపై అప్పుల భారాలు మోపి కేవలం తన పార్టీ ముఖ్య నేతలకు రాష్ట్ర ఖజానానంత దోచిపెట్టిందని విమర్శించారు. మళ్లీ అధికార దాహంతో చంద్రబాబు ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తూ, అధికారులపై దాడులు చేయిస్తూ రాష్ట్రంలో అలజడి సృష్టించాలని విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. వీటన్నింటినీ ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. బాబు, పవన్ ఎన్ని జిమ్మిక్కులు చేసినా 2024లో వైసిపిని ప్రజలు ఆశీర్వదిస్తారని ధీమా వ్యక్తం చేశారు. మున్సిపల్ ఛైర్మన్ బోయ శాంత, వైస్ ఛైర్మన్ ఎంఎంజి.గౌస్, కమిషనర్ రఘునాథ్ రెడ్డి, మార్కెట్ యార్డు ఛైర్మన్ మజార్ అహ్మద్, వైస్ ఛైర్మన్ కామాక్షి తిమ్మప్ప, వైసిపి పట్టణ అధ్యక్షులు బి.దేవా, స్టేట్ డైరెక్టర్ మంజుల, శ్రీలక్ష్మి, కౌన్సిలర్లు చలపతి, సురేష్, బికె.లక్ష్మన్న, బీటీ.లక్ష్మన్న, మున్సిపల్ ఇంజినీరు నాగభూషణం రెడ్డి, రామకృష్ణ, శీన, రామలింగేశ్వర్, ఆంధ్ర లక్ష్మన్న, ఫయాజ్, మల్లి, చంద్ర, చిన్న ఈరన్న పాల్గొన్నారు.



వార్డులో పర్యటిస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఏరూరు, కుందనగుర్తి వార్డు మెంబర్లు ఏకగ్రీవం

ప్రజాశక్తి - చిప్పగిరి

మండలంలోని ఏరూరు గ్రామంలోని 5వ వార్డు మెంబర్, కుందనగుర్తి పంచాయతీలో 7వ వార్డు మెంబర్ స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. ఆయా గ్రామాల్లో వార్డులకు సంబంధించి నామినేషన్లు వేయగా సోమవారం పంచాయతీ ఎన్నికల అధికారులు పరిశీలించారు. ఏరూరు పంచాయతీ నుంచి వార్డు మెంబర్ స్థానానికి రాగులపాడు సుమంజలి ఒక్కరే నామినేషన్ వేశారు. ఈమె ఏకగ్రీవం కావడంతో ఎన్నికల అధికారి జయలక్ష్మి రాగులపాడు సుమంజలికి ఏకగ్రీవ ఎన్నిక ధ్రువపత్రం అందజేశారు. అలాగే కుందునగుర్తి పంచాయతీలో వార్డు మెంబర్‌గా పోటీ చేసిన కొండ రేణుకమ్మకు ఎవరూ పోటీ లేకపోవడంతో ఆమెకు ఎన్నికల అధికారి బాల నాయుడు ఏకగ్రీవ ఎన్నిక ధ్రువపత్రం అందజేశారు. రెండు గ్రామాల్లో ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసినందున ప్రజలు, పోలీసు సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ధ్రువపత్రం అందుకుంటున్న సుమంజలి

సర్పంచుల వ్యవస్థను నిర్వీరం చేసిన జగన్

- టిడిపి ఇన్‌ఛార్జీ తిక్కా రెడ్డి

ప్రజాశక్తి - కౌతాళం

రాష్ట్రంలో సర్పంచుల వ్యవస్థను నిర్వీరం చేసిన ఘనత జగన్ ప్రభుత్వానికే దక్కిందని టిడిపి మంత్రాలయం ఇన్‌ఛార్జీ తిక్కారెడ్డి విమర్శించారు. సోమవారం బదినేహాల్ గ్రామంలో శ్రీమల్లికార్జున స్వామి దేవాలయంలో పూజలు నిర్వహించి ప్రచారం నిర్వహించారు. సర్పంచిగా టిడిపి మద్దతుదారుడైన హెచ్.వీరేష్‌కు గెలిపించాలని కోరారు. గ్రామస్తులు ఒక్క అవకాశం ఇవ్వాలని, గ్రామాన్ని అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ పంచాయతీలకు వస్తున్న నిధులను మళ్లించి, గ్రామాలను అభివృద్ధికి దూరం చేశారని విమర్శించారు. పంచాయతీ నిధులు మళ్లించిన ఘనత ఈ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. నిధులు లేక గ్రామంలో సమస్యలు పెరిగిపోయాయని తెలిపారు. సర్పంచులుగా గెలిచి కూడా వారికి ఆనందం లేకపోయిందన్నారు. గ్రామాన్ని అభివృద్ధి చేయాలని ఎన్నో ఆశలతో ఎన్నికల్లో పోటీ చేసి గెలిచిన సర్పంచులకు నిరాశే మిగిలిందన్నారు. గ్రామ ప్రథమ పౌరుడైన సర్పంచి గ్రామాన్ని అభివృద్ధి చేయలేక, ప్రజల వద్దకు వెళ్లాలంటే భయపడే రోజులు ఈ ప్రభుత్వంలో కనిపిస్తున్నాయన్నారు. టిడిపి హయాంలోనే పంచాయతీలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. బదినేహాల్ గ్రామంలో 19న జరగనున్న ఎన్నికల్లో టిడిపి బలపరుస్తున్న అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ తీర్పు రాబోయే ఎన్నికలకు నాంది పలకాలని తెలిపారు. టిడిపి నాయకులు చెన్నబసప్ప, వెంకటపతి రాజు, అడివెప్ప గౌడ్, టిప్పు సుల్తాన్, కొట్రేష్ గౌడ్, కురుగోడు, రమేష్ గౌడ్, వెంకట్ రెడ్డి, దొడ్డన్న గౌడ్, నరసింహులు, పెద్దవలీ, రాజాబాబు పాల్గొన్నారు.



బదినేహాలు గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న తిక్కారెడ్డి

టిడిపికి ఆదరణపెరుగుతోంది

- మాజీ మంత్రి అఖిలప్రియ

ప్రజాశక్తి - చాగలమర్రి

వైఎస్ఆర్సిపి నాయకుల నీచ రాజకీయాలతో రోజురోజుకు తెలుగుదేశం పార్టీకి ప్రజాదరణ వస్తున్నట్లు మాజీ మంత్రి భూమా అఖిలప్రియ స్పష్టం చేశారు. సోమవారం చాగలమర్రిలోని నూరాణి మసీదు సమీపంలోని కోటగడ్డ వెతికి చెందిన మలివేముల రియాజ్ (మాజీ వాలంటీర్) ఖాదర్ వలీ ,కాజా రసూల్, ఫకీర్ బాష, మహీర్, ఖాసిం వలి, గయాజ్, గఫార్, రఫీ, ఇలియాస్, అబ్దుల్ రసూల్, హుస్సేన్ భాష లతోపాటు మరో 10 కుటుంబాలు పార్టీలో చేరినట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ సెల్ టిడిపి ఉపాధ్యక్షులు ఆన్సర్ బాష, మండల కన్వీనర్ లాయర్ నరసింహారెడ్డి, నంద్యాల జిల్లా స్పోక్స్ పర్సన్ సల్ల నాగరాజు యాదవ్, టిఎన్టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తి నరసింహుడు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలన్నీ పరిష్కరిస్తాం

- టిడిపి కర్నూలు ఇన్చార్జి టిజి భరత్

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజల సమస్యలన్నీ పరిష్కరిస్తామని కర్నూలు నియోజకవర్గ ఇంచార్జి టి.జి భరత్ అన్నారు. సోమవారం నగరంలోని 17వ వార్డు పరిధిలోని సిపిఎం, సిపిఐ కొట్టాలలో భవిష్యత్తుకు గ్యారెంటీ పేరుతో ఆయన ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్నూల్లోని అమీర్ హైదర్ ఖాన్ నగర్‌తో పాటు ఈ ప్రాంతంలో కూడా సమస్యలు తీవ్రంగా ఉన్నాయన్నారు. ఇక్కడ ఇళ్ల పట్టాల సమస్య, నీటి కుళాయిల సమస్యతో పాటు రోడ్లు, డ్రైనేజీలు లేవన్నారు. తనకు ఒక్క అవకాశం ఇస్తే ప్రజల ఇబ్బందులు తొలగిస్తానని భరోసా ఇచ్చారు. అనంతరం గౌరి గోపాల్ హాస్పిటల్‌లో ఉచితంగా చేయించే వైద్య పరీక్షల కరపత్రాలు ఇచ్చి పరీక్షలు చేపించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టిడిపి నేతలు చంద్రమోహన్, వినోద్ చౌదరి, బాబ్జి, శేఖర్, నాగన్న, చిన్న, ప్రమోద్, సూరి, అశోక్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

19 వార్డు మెంబర్‌కు పోటీలో ఇద్దరు

ప్రజాశక్తి - పగిడ్యాల

రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సర్పంచి, వార్డు మెంబర్ల ఉప ఎన్నికలు నిర్వహించడానికి ఖాళీ స్థానాలకు నామినేషన్లు స్వీకరించడం జరిగింది. పగిడ్యాల పంచాయతీ పరిధిలో 9వ వార్డు మెంబర్ ఖాళీ ఏర్పడడంతో పలువురు పోటీకి నామినేషన్లు దాఖలు చేశారు. సోమవారం పోటీలో ఉన్న వ్యక్తులు ఉపసంహరణలో భాగంగా నలుగురు వ్యక్తులు పోటీలగాను ఇద్దరు పోటీ నుంచి ఉపసంహరించుకున్నట్లు ఎన్నికల రిటర్ని ంగ్ అధికారి సుభాన్ తెలిపారు. గుండెపోగు సాంబ శివుడు, మీనుగా బాబు పోటీలో ఉన్నట్లు ఆయన తెలిపారు. ఈనెల 19వ తేదీన ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదే రోజు ఫలితాలను వెల్లడించడం జరుగుతుందన్నారు.

ముఖ్యమంత్రికి పాలాభిషేకం

ప్రజాశక్తి - పాములపాడు

గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఆంధ్రప్రదేశ్ వివిధ స్థాయిలో పనిచేస్తున్న 45 69 మంది ఉద్యోగులకు 23 శాతం వేతనం పెంపుదల చేస్తూ ప్రభుత్వం జారీ చేసిన జిఒ 64ను స్వాగతిస్తూ మండల మహిళ సమాఖ్య కార్యాలయం నందు ఏపీఎం అనురాధ, సీసీలు సౌభాగ్య, మనోహర్, కేశవరావు, నాగమణి, మహిళలు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఏపీఎం అనురాధ మాట్లాడుతూ వేతనం పెంపకాలపై ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు జడ్పి విద్యార్థులు

ప్రజాశక్తి - చాగలమర్రి



ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం,ఉపాధ్యాయులు

చాగలమర్రి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ఐడికె శాస్త్రి తెలిపారు. సోమవారం పాఠశాలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన మాట్లాడుతూ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఈ నెల 13న ఆళ్లగడ్డ లో జరిగిన జిల్లా స్థాయి పోటీలలో పాఠశాల కు చెందిన వినయ్ బంగారు పతకాన్ని, మహీద్ రజితాన్ని, సాజిద్ కాంస్య పతకాన్ని సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారన్నారు. సెప్టెంబరు 9,10 తేదీల్లో కర్నూలులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో నంద్యాల జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని ఆయన తెలిపారు. ఎంపికైన విద్యార్థులతో పాటు, యోగా ఉపాధ్యాయులు నరేష్ కుమార్ రెడ్డి, మాబుసేన్‌లను పిడి దాదాపీర్, ఉపాధ్యాయులు మహబూబ్‌బాష, నారాయణ మూర్తి, రవీంద్ర రెడ్డి, శంకర్, మహబూబుబాష, హరిహరనాథరెడ్డి,అంబటి రాజ శేఖర్‌రెడ్డి, ప్రవీణ కుమారి, పిఈటి భారతిలు అభినందించారు.

కెజిబివి పాఠశాల విద్యార్థుల ప్రతిభ


కర్నూల్ కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న దృశ్యం

ప్రజాశక్తి - మిడుతూరు

మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాల విద్యార్థులు ఈనెల 11న కర్నూల్ అవుట్‌డోర్ స్టేడియంలో నిర్వహించిన ఆట్యా.. పాట్యా.. పోటీల్లో ప్రతిభ కనబరిచారు. ఈ పోటీల్లో పది జట్లు పాల్గొనగా కెజిబివి విద్యార్థులు 12 మంది రెండో స్థానం కైవసం చేసుకున్నారు. విద్యార్థులను కర్నూల్ కలెక్టర్ అభినందించి వారికి అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా సోమవారం క్రీడల్లో పాల్గొన్న 12 విద్యార్థులలో ముగ్గురు విద్యార్థినీలు (భువనేశ్వరి, కవిత, సంధ్యారాణి) రాష్ట్ర స్థాయిలో ఆడడానికి ఎంపికయ్యారు. ఈ మేరకు ప్రతిభ చూపిన విద్యార్థినులను ప్రిన్సిపల్ విజయలక్ష్మి, పిఇటి సుమలత అభినందించారు.


స్టేట్ సెలక్ట్ విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం


ఏకగ్రీవంగా ఎన్నికైన వార్డు సభ్యులకు ధ్రువీకరణ పత్రం అందిస్తున్న ఎన్నికల అధికారి జానకి రాముడు

వార్డు సభ్యులు ఏకగ్రీవ ఎన్నిక

ప్రజాశక్తి - ఆత్మకూరు

మండల పరిధిలో కరివేన గ్రామ పంచాయతీలోని. ముస్తే పల్లె గ్రామ పంచాయతీ లోను ఒక్కొక్క వార్డు సభ్యుల ఖాళీగా ఉన్న నేపథ్యంలో ఈ రెండు గ్రామాలలో వార్డు సభ్యులు ఎన్నిక కోసం నామినేషన్లు వేసిన వారందరూ విత్ డ్రా చేసుకోవడంతో రెండు గ్రామాలలో పోటీల్లో ఉన్న సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ముస్తే పల్లె గ్రామంలో రాజేశ్వరమ్మ, కరివేన గ్రామ పంచాయతీలో జి సంపత్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారులు తెలిపారు. ఎన్నికైన వార్డు సభ్యులకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి జానకిరామ్ ధ్రువీకరణ పత్రాలను అందజేశారు.

బంగారు పథకాలు అందుకున్న చిన్నారులు

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

దర్శిని కలై కోడం వారు నిర్వహించిన జాతీయ స్థాయి బాలల చిత్రలేఖన పోటీలలో 6 మంది బాలలకు బంగారు పతకాలు వచ్చినట్లు ఆర్ట్ టీచర్ దేశెట్టి శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నందికొట్కూరు పట్టణా నికి చెందిన సెయింట్ మేరీస్ హై స్కూల్ విద్యా ర్థులు అభిజిత, వేదశ్రీ, పెద్ద కోట హైస్కూల్ కు చెందిన పూజారి హేమలత, హౌసింగ్ బోర్డ్ ప్రాథమిక పాఠశాలకు చెందిన చైత్ర, గీత శ్రీ, రుచిత, అను పలువురు విద్యార్థులు బంగారు పతకాలు సాధించినట్లు వారు తెలిపారు. ఈ బంగారు పతకాలు సాధించిన చిన్నారులకు రామకష్ణ మిషన్ స్కూల్ టీ నగర్ చెన్నై నందు ఈ బహుమతులు అందుకున్నారని వారు తెలిపారు. గతంలో కూడ 300 మంది విద్యార్థులకు గోల్డ్, సిల్వర్ పథకాలను సాధించామని వారు తెలిపారు. అలాగే ఆర్ట్ టీచర్ అయిన దేశెట్టి శ్రీనివాసులకు 40 ఉత్తమ, బెస్ట్ ఆర్ట్ టీచర్ జాతీయ అవార్డులు అందుకున్నారని వారు తెలిపారు.



బంగారు పతకాలు అందుకుంటున్న చిన్నారులు


రైతుల అభివృద్ధికి కృషి

- నాగంపల్లి సొసైటీ చైర్మన్ గా గౌరు జనార్ధన్ రెడ్డి

ప్రజాశక్తి - కొత్తపల్లి

మండల కేంద్రమైన కొత్తపల్లిలో ఉన్న నాగంపల్లి సొసైటీ చైర్మన్‌గా ఎర్రమఠం గ్రామానికి చెందిన గౌరు జనార్దన్ రెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచిన రైతుల అభివృద్ధి కోసం పాటుపడతానని తెలిపారు. డైరెక్టర్లుగా పెద్ద గుమ్మడాపురం గ్రామానికి చెందిన అచ్చిరెడ్డి, దుద్యాల గ్రామానికి చెందిన చంద్రమోహన్ బాధ్యతలు చేపట్టారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన వారిని జడ్పిటిసి సోముల సుధాకర్ రెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ సుధాకర్ రెడ్డి, సొసైటీ అధికారులు కోటేశ్వరయ్య, పలువురు అభినందనలు తెలిపి సన్మానించారు.


బాధ్యతలు చేపట్టిన సొసైటీ చైర్మన్



ప్రాజెక్టులను పూర్తి చేయడంలో ప్రభుత్వం విఫలం

- మాజీ ఎమ్మెల్యే బుడ్డా

ప్రజాశక్తి - ఆత్మకూర్

శ్రీశైలం నియోజకవర్గంలో పెండింగ్లో ఉన్న ప్రాజెక్టులను చెరువులను, కాలువలను పూర్తి చేయడంలో వైసిపి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని శ్రీశైలం నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి అన్నారు. సోమవారం నాడు ఆత్మకూరు మండలంలోని వడ్ల రామాపురం గ్రామ సమీపంలో ఉన్న చిన్న పెద్ద మల్లెలమ్మ చెరువును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో శివ భాష్యం గౌడ్ ప్రాజెక్టుకు 22 కోట్ల రూపాయలతో కాలువలు మరమ్మతులకు గేట్లు తయారీకి తను నిధులు తెచ్చానని, అవి కూడా పూర్తి కాలేదు అన్నారు. చిన్న పెద్ద మల్లెలమ్మ చెరువు అలుగు సమీపంలో సొంత నిధులతో బ్రిడ్జి నిర్మించి వడ్ల రామపురం గ్రామం వరకు రోడ్డు వెయ్యి ఇస్తానని ప్రస్తుత ఎమ్మెల్యే శిల్పా ఇచ్చిన హామీ అమలు కాలేదని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు శివరామిరెడ్డి, శివప్రసాద్ రెడ్డి, వేణుగోపాల్, చిన్న, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



చిన్న పెద్ద మల్లెలమ్మ చెరువును పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే బుడ్డా



బాధితులను విచారిస్తున్న డిఎస్పి వెంకట్రామయ్య

ఎస్సి ఎస్టి కేసుపై డిఎస్పి విచారణ

ప్రజాశక్తి - చాగలమర్రి

మండలంలోని మద్దూరు గ్రామంలో ఈ నెల 1న నమోదు అయిన ఎస్సీ,ఎస్టీ కేసుపై ఆళ్ల గడ్డ డిఎస్పి వెంకట్రామయ్య సోమవారం విచా రణ చేపట్టారు. డిఎస్పి తెలిపిన వివరాల మేర కు.. గ్రామానికి చెందిన మహబూబ్ షరీఫ్కు దండు లక్ష్మిదేవికి భూసమస్య ఉండేది. దీంతో పొలం వద్ద షరీఫ్ కులం పేరుతో దూషించి దుర్భాషలాడటంతో బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోద చేయడం జరిగింది. దీనిపై విచారణ చేపట్టినట్లు డిఎస్పి వివరించారు.

వార్డు సభ్యులు ఏకగ్రీవ ఎన్నిక

ప్రజాశక్తి - చాగలమర్రి

మండల పరిధిలోని రాంపల్లి గ్రామంలో మూడో వార్డు సభ్యులుగా దస్తగిరమ్మ ఏకగ్రీవంగా ఎంపికయింది. గతంలో వార్డు సభ్యురాలుగా బాబక్క అనారోగ్యంతో మృతి చెందడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. గ్రామానికి చెందిన తోపుల లక్ష్మీదేవి, హుస్సేనమ్మ, మౌలాలమ్మ, దస్తగిరమ్మ నామినేషన్లు దాఖలు చేశారు. గ్రామ పెద్దలందరూ బాబక్క చెల్లెలు అయిన ఏకగ్రీవంగా ఎన్నికయ్యేల కృషి చేశారు. నామి నేషన్ దాఖలు చేసిన మిగతా ముగ్గురు సభ్యులు ఉపసం హరణకు చివరి రోజైన సోమవారం తమ నామినేషన్ పత్రాల ను ఉపసంహరించుకున్నారు. దీంతో దస్తగిరమ్మ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి జగ్గయ్య ఎన్నిక ధ్రువీకరణ పత్రాన్ని దస్తగిరమ్మకు అందజేశారు. ఏకగ్రీవ ఎన్నిక కృషి చేసిన గ్రామ పెద్దలను గ్రామ ప్రజలు అభినందించారు.



ర్యాలీ చేస్తున్న దృశ్యం

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి

ప్రజాశక్తి - కొత్తపల్లి : గ్రామాల్లో ఉన్న ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలని మండల వినియోగదారుల రక్షణ మండలి అధ్యక్షులు బొల్లు ప్రసాద్ బాబు యాదవ్, పాఠశాల ఉపాధ్యాయులు జంబులయ్య తెలిపారు. సోమవారం మండలంలోని పెద్ద గుమ్మడాపురం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహి ంచారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి వారు మాట్లాడారు. అనంతరం పాఠశాల విద్యార్థులతో వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అంగన్వాడి సిబ్బంది ధనలక్ష్మి, మల్లేశ్వరి బాయ్, మహిళ పోలీస్ జ్యోతి వి బి కే కృష్ణుడు, గ్రామ యువత సురేంద్ర సురేంద్ర గౌడ్ పాల్గొన్నారు.

అధికమవుతున్న మహిళల మిస్సింగ్ కేసులు



మహిళలతో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి

ప్రజాశక్తి-డోన్

రాష్ట్రంలో అధికంగా మహిళలు మిస్సింగ్ కావడం బాధాకరం అని యస్సీ యస్టీ బిసి మైనార్టీ మహిళా ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి అన్నారు. సోమవారం డోన్ పట్టణం లోని ఆటోనగర్ లో యస్సీ యస్టీ బిసి మైనార్టీ మహిళా ఐక్య వేదిక ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా మహిళా ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షు రాలు పట్నం రాజేశ్వరి,రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి లు హాజర య్యారు. ఈ సందర్భంగా నంది విజయలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళల మిస్సింగ్ కేసులు రోజు రోజుకు పెరిగిపోతున్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు ఆంధ్రప్రదేశ్ లో అధికారికంగానే 38,000 మహిళల మిస్సింగ్ కేసులు నమోదు అయ్యాయి అంటే రిజిస్టర్ కానివి ఇంకా ఎన్నో మహిళలపై జరుగుతున్న నేరాలను అరికట్టడంలో పోలీసు అధికారులు పూర్తిగా విఫలం అయ్యారని ఆమె అన్నారు. మహిళలు ఏకమై సంఘటిత పోరాటాలకు సిద్ధం కావాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది రాధిక,వెంకటలక్ష్మి, శిరోమణి, బోయలక్ష్మీదేవి, దూదేకుల షేకూన్ బీ,వడ్డే వరలక్ష్మీ,ఉషారాణి, పద్మావతి, పుల్లమ్మ, సుబ్బ లక్ష్మి, చాంద్ బీ,వడ్డే సరోజ,చాకలి సరోజ,ఆకుతోట పద్మావతి, గుండెపోగు ప్రభావతి,కొమ్ము పెద్దక్క,మంగమ్మ, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై మల్లికార్జున

ఉరేసుకుని మహిళా ఆత్మహత్య

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

బండి ఆత్మకూరు మండల కేంద్రానికి చెందిన కురువ యశోద అనే మహిళ భర్త కుటుంబ సభ్యుల వేధింపులు తాపలేక సోమవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో ఇంట్లో ఫ్యాన్కు ఉరివేసుకొని మృతి చెందినట్లు ఎస్సై మల్లికార్జున తెలిపారు. యశోద తండ్రి మారెన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మహిళా ఆత్మహత్య

ప్రజాశక్తి - పాములపాడు

మండలంలోని చెల్లెమిల్ల గ్రామానికి చెందిన నందిని (35) పంటలకు వేసే విషపు గుళికలను మింగి ఆత్మహత్య చేసుకుంది. పాములపాడు ఏఎస్ఐ ఏసయ్య తెలిపిన వివరాల మేరకు ఆత్మకూరు మండలం సిద్దాపురం గ్రామానికి చెందిన గౌరీ శంకర్, నందిని దంపతులు గత 15 సంవత్సరాల క్రితం చెలిమిల్ల గ్రామానికి వచ్చి జీవనం కొనసాగిస్తున్నారు. భర్త తాగుడుకు బానిస కావడంతో పలుమార్లు చెప్పిన భర్త మారకపో వడంతో నందిని మనస్తాపనకు గురై సోమవారం తెల్లవారు జామున పొలాలకు వేసే గుళికలను మింగి ఆత్మహత్యకు పాల్పడింది. వాంతులు, నోటిలో నురుగు రావడంతో ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లగా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతురాలికి భర్త ఇద్దరు కుమారులు ఒక అమ్మాయి ఉన్నారు. ఘటనపై మృతురాలు తల్లి దస్తగిరిమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.



రాజకీయ లబ్ధి కోసమే కేంద్రం

అప్పర్ భద్ర, పాలమూరు ప్రాజెక్టులకు అనుమతులు

- గుండ్రేవుల, వేదవతిలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టాలి - రాయలసీమ సాగునీటి సాధన సమితి

ప్రజాశక్తి - నంద్యాల

కేంద్ర ప్రభుత్వం తమ రాజకీయ లబ్ధి కోసమే కర్నాటకలోని అప్పర్ భద్ర ప్రాజెక్టుకు జాతీయ హోదా, తెలంగాణలోని పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు మంజూరు చేసిందని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు దశరథరామిరెడ్డి సోమవారం నంద్యాలలో కార్యాలయంలో పత్రికా ప్రకటనను విడుదల చేశారు. అత్యంత వెనుకబడిన ప్రాంతమైన రాయలసీమ అవసరాలను పరిగణనలోకి తీసుకోకుండా పలు ప్రాజెక్టులకు కేంద్రం అనుమతులు ఇవ్వడం సరికాదన్నారు. అప్పర్ భద్ర ప్రాజెక్టు, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుల అనుమతులకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్రంపై ఒత్తిడి చేశాయి, కానీ రాయలసీమ ప్రాజెక్టులకు కేటాయించిన నీటిని వినియోగించుకొనడానికి రాష్ట్ర విభజన కంటే ముందే డిపిఆర్ అనుమతులు పొందిన గుండ్రేవుల రిజర్వాయర్ నిర్మాణం, అనేక దశాబ్దాలుగా ప్రతిపాదనలో ఉన్న తుంగభద్ర హైలెవెల్ సమాంతర కాలువల నిర్మాణం, సిద్దేశ్వరం అలుగు నిర్మాణం, వేదవతి ఎత్తిపోతల పథకాలు గురించి పాలకులు ఆలోచన చేయకపోవడం బాధాకరం అని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రాజకీయ పార్టీలు రాయలసీమకు బాసటగా నిలబడక పోవడం దారుణం అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, అన్ని రాజకీయ పార్టీలు ఆ దిశగా క్రియాశీలకంగా పని చేయాలని దశరథరామిరెడ్డి విజ్ఞప్తి చేసారు.

వర్క్ ఛార్జుడు ఉద్యోగులు నూతన సంఘం ఏర్పాటు

ప్రజాశక్తి - బనగానపల్లె రూరల్

రహదారులు భవనముల శాఖ, వర్క్ ఛార్జుడు ఉద్యోగుల నూతన కార్యవర్గం సంఘం ఏర్పాటు చేశారు. సోమవారం సాయంత్రం ఉద్యోగులు సమావేశము బనగానపల్లెలో నిర్వహించి, నూతన కార్యవర్గమును ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారి గా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డి. సత్యవతి, ఎన్నికల పరిశీలకులుగా నంద్యాల జిల్లా, గౌరవ అధ్యక్షులు ఎ. కొండయ్యలు వ్యవహరించారు. ప్రెసిడెంట్గా ఎం. దేవదాస్, సెక్రటరీగా ఎస్ఎండి ఖలీల్, వైస్ ప్రెసిడెంట్గా జమాల్ వల్లి, ట్రెజరుగా అల్తాఫ్ హుస్సేన్, కార్యవర్గ సభ్యులుగా షేక్ ఇమామ్ బి, ఎం.నసీంబి మరో నలుగురు కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నట్లు డి. సత్యవతి తెలిపారు.



వృద్ధాశ్రమంలోని వృద్ధులను ఆదరించాలి

ప్రజాశక్తి-డోన్



వృద్ధాశ్రమంలో ఉండే వృద్ధులను ఆదరించాలని హోసన్నా వృద్ధాశ్రమ నిర్వాహకులు జాన్‌ప్రభాకర్ పేర్కొన్నారు. సోమవారం డోన్ పట్టణంలోని వైయస్ నగర్ ఉన్న వృద్ధాశ్రమంలో ఉండే వృద్ధులకు డోన్ మండల పరిధిలోని బి.రామదుర్గం గ్రామానికి చెందిన ఎం.రాజశేఖర్ సూర్యకాం తమ్మ దంపతుల కుమారుడు అకిరానంద మొదటి పుట్టినరోజు సందర్భంగా ఆశ్రమంలో భోజనాలు ఏర్పాటు చేసి సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా జాన్‌ప్రభాకర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వారు జరుపుకునే కార్యక్రమాలలో నిరుపేదలను జ్ఞాపకం చేసుకొని వారికి ఒక పూట కడుపు నింపాలని పేదలకు అవసరమైన వస్తువులు ఇచ్చి నలుగురికి ఆదర్శంగా నిలవాలని కోరారు. వృద్ధాశ్రమంలో ఉండే వృద్ధులు రాజశేఖర్, సూర్యకాం తమ్మ దంపతుల కుమారుడు అకిరానందన్ని దీవించారు. కార్యక్రమంలో మహేశ్వరి



రైతుల నడ్డి విరుస్తున్న ఏకైక సిఎం జగన్ : టిడిపి


ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి అధికారంలోకి రాకముందు రైతులను అన్ని విధాలా అదుకుంటానని, చంద్రబాబునాయుడు హయాంలో వర్షాలు రావని తప్పుడు ప్రచారం చేసి 2019 ఎన్నికలలో గెలుపొందిన తర్వాత రాష్ట్రంలో 8సార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజల నడ్డి విరిచారని, వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించి ఏ రాష్ట్ర ముఖ్యమంత్రి చేయని దుస్సాహసానికి పాల్పడిన ఏకైక దౌర్భాగ్యమైన సిఎం జగన్మోహన్ రెడ్డేనని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ బిటి నాయుడు ఆరోపించారు. సోమవారం స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడారు. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో వర్షాభావ పరిస్థితులు నెలకొని, రాష్ట్రంలోని జలాశయాలలో నీరు లేని పరిస్థితిలో కూడా అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఒక్క రోజు కూడా విద్యుత్ కోతలు లేకుండా విద్యుత్ సరఫరా చేయించారని తెలిపారు. రైతులు ఉపయోగించే విద్యుత్కు ఎలాంటి కోతలు లేకుండా నాణ్యమైన విద్యుత్ను అందించి రైతు బాంధవుడుగా నిలిచారని అన్నారు. చంద్రబాబు నాయుడు 5 సంవత్సరాల పాలనలో ఏ ఒక్క రోజు కూడా విద్యుత్ చార్జీలు పెంచలేదని గుర్తు చేశారు. అయితే ప్రస్తుత సైకో ముఖ్యమంత్రి 8 సార్లు పెంచి ప్రజలపై విద్యుత్. చార్జీల గుదిబండ మోపారని ఆరోపించారు. అది చాలదన్నట్టు రైతులకు పెనుభారంగా వ్యవసాయానికి ఉపయోగించే విద్యుత్ మోటార్లకు మీటర్లు పెట్టించి వారి నడ్డి విరిచారని పేర్కొన్నారు. జగన్ అనుసరిస్తున్న ప్రజా, రైతు వ్యతిరేక విధానాలకు బుద్ధి చెప్పాలంటే రానున్న 2024 ఎన్నికలను వైసిపి పాలనకు చరమగీతం పాడాలన్నారు.

భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి : ఐఎఫ్టియు

ప్రజాశక్తి - నంద్యాల

భవన, నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం, ఐఎఫ్టియు నంద్యాల డివిజన్ అధ్యక్షులు ఎస్ మహమ్మద్, పిడిఎస్యు ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎస్ఎండి రఫీలు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం ఐఎఫ్టియు ఆధ్వర్యంలో లేబర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, ఏసీఎల్కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డులోని నిధులను ఇతర రంగాలకు మళ్లించడం దుర్మార్గం అని పేర్కొన్నారు. బిఓసి బోర్డులో ఉన్నటువంటి నిధులను భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం మాత్రమే ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. 65 ఏళ్లు నిండిన కార్మికుడికి రూ.5000 పెన్షన్ ఇవ్వాలని, పెండింగ్లోని క్లైమ్లను పరిష్కరించాలని, హెల్త్ కార్డు, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. అర్హులైన కార్మికులకు ఇంటి స్థలము ఇచ్చి గృహాలు నిర్మించాలని, గతంలో ఇచ్చిన హామీ మేరకు రూ.10 వేల చొప్పున కార్మికుడి ఖాతాలో జమ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ భవన నిర్మాణ కార్మిక సంఘం డివిజన్ నాయకులు మున్నా మౌలిసా, ఇంతియాజ్, రహిమాన్, ఇర్ఫాన్, మహబూబ్బాషా, మహబూబ్వాలి, రఫీ పఠాన్, రవి,కిరణ్, తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందచేస్తున్న నాయకులు

సిఐ మురళీధర్ రెడ్డికి ఉత్తమ సేవా అవార్డు

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్



కర్నూలు 3 టౌన్ సిఐ దాదిరెడ్డి మురళీధర్ రెడ్డికి రాష్ట్రపతి ఉత్తమ సేవా అవార్డు లభించింది. ఈ మేరకు ఆదివారం భారత ప్రభుత్వం రాష్ట్రపతి పోలీస్ ఉత్తమ సేవ అవార్డుల జాబితాను విడుదల చేసింది. ఈ జాబితాలో ఆయన ముందు వరసలో ఉండడం గమనార్హం. ఈయన తన సర్వీసు రికార్డులో ఆరు ఎంఎస్ఇ అవార్డులు, 135 గుడ్ సర్వీస్ ఎంట్రీ అవార్డులు, 25 నగదు అవార్డులు, 6 కమాండేషన్ అవార్డులు సాధించారు. వీటితోపాటు 2009లో సేవా పతకం, 2021లో ఉత్కృష్ట సేవా పతకం, 2022లో ఉత్తమ సేవా పతకం పొందారు. ప్రస్తుతం పోలీస్ ఉత్తమ సేవా పతకాన్ని సాధించారు. ఈ పతకాన్ని ఆయన దేశ రాజధాని ఢిల్లీలో 2024 జనవరి 26న జరగనున్న స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకోనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా పోలీసు శాఖ హర్షం వ్యక్తం చేస్తోంది.

జమాల్వలి మృతి తీరని లోటు

- మాజీ మంత్రి భూమా అఖిలప్రియ

ప్రజాశక్తి - చాగలమర్రి



మండలంలోని పెద్దవంగలి గ్రామానికి చెందిన మాజీ మండల ఉపాధ్యక్షుడు, తెలుగుదేశం సీనియర్ నాయకులు చాపల జమాల్వలి (73) మృతి భూమా కుటుంబానికి, టిడిపికి తీరని లోటు అని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ తెలిపారు. టిడిపి సీనియర్ నాయకులు జమాల్ వలి అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి భూమా అఖిలప్రియ గ్రామానికి చేరుకొని జమాల్ వలి మృతదేహంపై పూలమాల వేసి నివాళులు అర్పించి, కుటుంబీకులకు సానుభూతి వ్యక్తం చేసారు. సంతాపం తెలిపిన వారిలో టిడిపి రాష్ట్ర మైనారిటీ సెల్ ఉపాధ్యక్షులు అన్సర్ బాషా, మండల కన్వీనర్ లాయర్ నరసింహారెడ్డి,జిల్లా బిసి సెల్ స్పోక్ పర్సన్ సల్లా నాగరాజు యాదవ్,టిడిపి నాయకులు పాల షరీఫ్,నాగేంద్ర, సంజీవరెడ్డి,కొలిమి హుసేన్వళి,షరీఫ్,మౌళాలి,కసినేని ఓబులేసు, బషీర్,తదితరులు పాల్గొన్నారు.

గాంధేయవాది ఆర్.కె.రామ్

ప్రజాశక్తి - చాగలమర్రి

జాతిపితను చూడటం ఒక గొప్ప అనుభవం. ఆయనను ముట్టుకోవడం అంతులేని ఉత్తేజం. ఆయనతో మాట్లాడడం మహాదానందమని భావించేవారు. అలాంటి మహాత్ముడికి సేవలు అందించిన తెలుగు వ్యక్తి ఆర్కె.రామ్. ఆయనది నంద్యాల జిల్లాలోని చాగలమర్రి. బాల్యంలోనే మహాత్ముడి శాంతియుత పోరాటాల గురించి విని, చదివి ప్రభావితుడయ్యారు. మనసులో గాంధీ ఆలోచనలు నాటుకుపోయాయి. మహాత్ముడిని కలుసుకోవాలని ఇల్లు విడిచి వెళ్లిపోయారు. నానా కష్టాలు పడి మహాత్ముని సేవాగ్రాం చేరుకున్నారు. అక్కడ ఉంటూ గాంధీతో అత్యంత సన్నిహితంగా మసలుతూ ఆనందించారు. మహాత్మా గాంధీ నవకాశీ యాత్ర చేసినప్పుడు ఆయన వెంట ఉన్న ఏకైక తెలుగువాడు ఆర్కె.రామ్ మాత్రమే. మహాత్ముడు మరణాంతరం చితాబస్మాని ఒక ప్రత్యేక రైలులో దేశంలోని ప్రముఖ ప్రదేశాలకంతా తీసుకెళ్లిన బృందంలో ఉన్న ఏకైక తెలుగు వ్యక్తి కూడా ఆయనే కావడం విశేషం.


మహాత్మునికి సేవలు అందించిన శిష్యుడు

బాల్యం నుంచి అభ్యుదయ మార్గంలో

ఆర్కె.రామ్ పూర్తి పేరు ఆర్కె.రామలింగారెడ్డి. ఈయన 1922 మేలో చాగలమర్రి గ్రామంలో జన్మించారు. తల్లిదండ్రులు కొండారెడ్డి, పుల్లమ్మ. ప్రాథమిక విద్య అంతా ఇంటి వద్దనే జరిగింది. ఉన్నత వర్గాలకు చెందిన కుటుంబం కావడంతో ఉపాధ్యాయులు ఇంటి వద్దకు వచ్చి విద్యాబోధన చేసేవారు. తండ్రి కొండారెడ్డికి ఆధ్యాత్మిక, ధార్మిక చింతన బాగా ఉండేది. ఆయన గ్రామంలోని దేవాలయానికి వెళ్లి నిత్యం పూజలు చేసేవారు. అలా ఆర్కె.రామ్ కూడా తండ్రి వెంట దేవాలయానికి వెళ్లేవాడు. అయితే అప్పట్లో కుల వ్యవస్థ బలంగా ఉండేది. దీన్ని వ్యతిరేకిస్తూ ఆర్కె.రామ్ తన పేరు చివరలోని కులాన్ని వదిలేసి ఆర్కె,రామ్గా పేరు మార్చుకున్నారు.


ఆర్.కె. రామ్(ఫైల్ ఫోటో)

సేవా గ్రామ్లో మహాత్మునికి సేవకునిగా

1937లో జరిగిన జనరల్ ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున ఆర్కె.రామ్ ప్రచారం చేశారు. 17 ఏళ్ల వయసులోనే ఆయన నాటి కాంగ్రెస్ పార్టీ తాలూకా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 1941లో జరిగిన ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని నాలుగు నెలలు కారాగారవాసాన్ని అనుభవించారు. విడుదల అయ్యాక నేరుగా మహాత్ముని దర్శించేందుకు రైలు బండి ఎక్కారు. రెండు రోజులు ప్రయాణం చేసి పస్తులు ఉండి, చివరికి మహాత్మా గాంధీ సేవాగ్రామ్ చేరుకున్నారు. ఆశ్రమంలో పాకీ పని చేస్తూ గాంధీజీకి రాట్నం సిద్ధం చేస్తూ ఆయనకు అనారోగ్యం కలిగినప్పుడు కంటి రెప్పలా చూసుకుంటూ అత్యంత సన్నిహితుడయ్యారు. మహాత్మా గాంధీ ఎక్కడికి వెళ్లినా రామ్ను ఆయన వెంట తీసుకుని వెళ్లేవారు. అలా మధురలోని మీనాక్షి దేవాలయాన్ని సందర్శించడం రామ్ జీవితంలో ఒక మధుర జ్ఞాపకంగా చరిత్రకారులు చెప్తారు.

స్వాతంత్రానంతరం ప్రజాసేవలో

స్వాతంత్రానంతరం 1947లో ఆర్కె.రామ్ను ఆంధ్ర గ్రంథాలయ మహాసభకు ఆహ్వాన సంఘం అధ్యక్షుడిగా ఎన్నుకుని సముచిత గౌరవం ఇచ్చారు. 1952-53లో సర్వోదయ భూదాన ఉద్యమానికి ఉపసంచాలకులుగా ఆయన వ్యవహరించారు. 1955లో వినోబా భావే ఆంధ్ర ప్రాంతంలో జరిపిన పర్యటనకు రామ్ నాయకత్వం వహించారు. అనంతలక్ష్మిని కులాంతర వివాహం చేసుకొని వర్ణ వ్యవస్థ పట్ల తన మనోభావాలను తేటతెల్లం చేశారు. 1960లో ఇజ్రాయిల్ దేశ పర్యటన జరిపి అక్కడ గోల్డమేర్ను కలిశారు. రామ్ లాగే ఆయన ధర్మపత్ని అనంతలక్ష్మి కూడా ప్రజాసేవకే తన జీవితాన్ని అంకితం చేశారు. మహిళా చైతన్యం కోసం అవిటి వారికి విద్యా బోధన కోసం ఎంతో కృషి చేశారు. వయోజన విద్యా కార్యక్రమాలను అమలు చేశారు. రామ్ 1950లో ఆంధ్ర విశ్వవిద్యాలయానికి సెనెట్ సభ్యుడిగా, ఖాదీ గ్రామోద్యోగ బోర్డుకు 1962 నుంచి 1965 వరకు అధ్యక్షుడిగా పని చేశారు. భూదాన్ అనే పత్రికకు సంపాదకుడిగా పని చేశారు. జిల్లా హరిజన సేవక సంఘం అధ్యక్షుడిగా, ఆంధ్ర హరిజన సేవక్ సంఘ్ కార్యనిర్వాహక కార్యదర్శిగా నాటి బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఎన్నో సేవలు అందించారు. చాగలమర్రికి హైస్కూల్, ఆసుపత్రి, కళాశాల రావడం కోసం ఎంతో శ్రమించారు. 1985 డిసెంబర్ 3న తన స్వగ్రామం చాగలమర్రిలో ఆయన తుది శ్వాస విడిచారు. బాపూజి ప్రియ శిష్యునిగా, సంఘ సంస్కర్తగా, అన్నింటికీ మించి ఒక విశిష్టమైన వ్యక్తిత్వానికి సిసలైన చిరునామాగా ఆయన జిల్లా ప్రజల హృదయాల్లో నిలిచిపోయారు.




నెహ్రూ గారితో ఆర్.కె. రామ్


చాగలమర్రిలో ఆర్కె.రామ్ ఇల్లు


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే లబ్బి

దళితుల పక్షపాతి సీఎం జగన్

- మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకట స్వామి
- 80 బన్నూరు సహకార సంఘం చైర్మన్ గా స్వీకారం.

ప్రజాశక్తి - నందికొట్కూరు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి దళితుల పక్షపాతి అని మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి అన్నారు. సోమవారం జూపాడుబంగ్లా మండ లం 80- బన్నూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్‌గా వైవీ రమణ ప్రమాణ స్వీకారోత్సవం అట్టహాసంగా నిర్వహి ంచారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే లబ్బి హాజ రయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాల ద్వారా నిరుపేద కుటుంబాలు లబ్ధి పొందాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈవో చంద్రశేఖర్ గౌడ్, శివ,హరి మహేష్,అనిల్,ఎంపీపీ సువర్ణమ్మ జెడ్పిటిసి పోచ జగదీశ్వర్ రెడ్డి, వైస్ ఎంపీపీ తోకల కృష్ణారెడ్డి, సర్పంచులు, వైసిపి నాయకులు కే నాగార్జున రెడ్డి, సూది రెడ్డి రమేష్ రెడ్డి, తిరుమల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


మొట్టమొదటి దళిత చైర్మన్‌గా వైవీ రమణ

జూపాడుబంగ్లా మండలం 80- బన్నూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్‌గా వైవీ రమణ చరిత్ర సృష్టించారు. 1956లో ఏర్పడిన సహకార సంఘం చైర్మన్‌గా ఇప్పటి వరకు ఎస్సీలకు కేటాయించలేదు. శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్దార్థ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకట స్వామిల కృషితో ప్రభుత్వం వైవీ రమణను చైర్మన్‌గా నియామకం అయ్యారు. గతంలో వైవీ రమణ మండ్లెం గ్రామ సర్పంచిగా చేసిన సేవలను గుర్తించి ఆయనకు చైర్మన్ పదవీ వరించింది.

కేసీ కాల్వకు నీరు విడుదల చేయాలి : టిడిపి

ప్రజాశక్తి - నందికొట్కూరు

శ్రీశైలం డ్యాంలో 860 అడుగులకు పైగా నీరు చేరుకున్నందున మల్యాల ఎత్తిపోతల పథకం నుండి కేసి కాల్వకు నీరు విడుదల చేయాలని టిడిపి నంద్యాల జిల్లా మాజీ అధ్యక్షుడు గౌరు వెంకట్ రెడ్డి, నంద్యాల పార్లమెంట్ ఇన్చార్జి మాండ్ర శివానం దరెడ్డి, రైతుల ఆధ్వర్యంలో సోమవారం మల్యాల ఎత్తిపోతల పథకం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భ ంగా వారు మాట్లాడుతూ మల్యాల ఎత్తిపోతల పథకం ద్వారా కేసి కెనాల్‌కు నీటిని విడుదల చేసి పంటలకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నీరు సమృద్ధిగా ఉన్నా.. రైతులను ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. వెంటనే నీరు విడుదల చేసి ఆయకట్టు రైతులను ఆదుకోవాలని కోరారు. లేనిపక్షంలో పోరును తీవ్రతరం చేస్తామని వారు మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో దేవెళ్ల మురళి, ఎస్సీ సెల్ ఆర్గనైజింగ్


మాట్లాడుతున్న మాండ్ర, చిత్రంలో గౌరు వెంకట్ రెడ్డి

సెక్రటరీ జయ సూర్య, రాష్ట్ర ముస్లిం మైనార్టీఅధికార ప్రతినిధి షకిల్ అహ్మద్, ఐ టీడీపీ ముత్తు జావలి, క్లస్టర్ ఇంచార్జ్ జాకీర్ హుస్సేన్, పలుచాని మహేశ్వర్ రెడ్డి, మహేష్ నాయుడు, వెంకటేశ్వర్ల యాదవ్, గిరీశ్వర్ రెడ్డి, ఓబుల్ రెడ్డి, పాములపాడు కృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

మిద్దె కూలి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

మండలంలోని అయ్యవారు కోడూరు గ్రామానికి చెందిన షేక్ ఖాజా హుస్సేన్ (63) సోమవారం తన ఇంటిలో కూర్చొని ఉండగా మట్టిమిద్దె అకస్మాత్తుగా కూలి తలకు రక్త గాయాలై అక్కడక్కడే మృతిచెందినట్లు ఎస్ఐ మల్లికార్జున్ తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ అన్నారు.

అమరవీరుల త్యాగాలు మరువలేనివి

ప్రజాశక్తి - ఆత్మకూరు

అమరవీరుల త్యాగాలు మరువలేనివని ఉన్నత పాఠశాల వెంకటాపురం ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు అన్నారు. సోమ వారం నాడు వెంకటాపురం గ్రామంలోని ఉన్నత పాఠశాల యందు అమరవీరుల శిలాఫలకాని ఏర్పాటు చేసి మొక్కలు నాటించారు. అనంతరం విద్యార్థులకు అమరవీరుల ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జవహర్ నాయక్ గాలిబ్ అహ్మద్, రమణ, పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్, శివారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు. **పాములపాడు :** మండలం లోని భానుముక్కల, బానకచర్ల గ్రామాలలో ఎంపీడీవో గోపికృష్ణ, ఏపీడి అన్వర్ బేగం, బానకచెర్ల సర్పంచ్ ఆవుల జయసుధ, ఏపీవో విమలమ్మ నా భూమి నా దేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సచివా లయం దగ్గర శిలాఫలకాలు ఏర్పాటు చేశారు.



మద్దూరు సహకార సంఘం చైర్మన్ గడ్డం కృష్ణారెడ్డి

ప్రజాశక్తి - పాములపాడు

మండలంలోని మద్దూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్‌గా గడ్డం కృష్ణారెడ్డి సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సొసైటీ చైర్మన్‌ల నియామకం గత రెండు రోజుల క్రితం చైర్మన్‌లను ప్రకటించడం జరిగింది. పాములపాడు మండలం మద్దూరు గ్రామం సొసైటీకి వాడాల గ్రామానికి చెందిన గడ్డం కృష్ణారెడ్డి చైర్మన్‌గా, డైరెక్టర్లుగా కే బాలసుబ్బారెడ్డి, బి రమణయ్యలు ప్రమాణ స్వీకారం చేశారు. గడ్డం కృష్ణారెడ్డిని మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి, వివిధ గ్రామాల నాయకులు రైతులు దుశాలవలు కప్పి పూలమాలలు వేసి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. లబ్బి వెంకటస్వామి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా ఉందన్నారు. చైర్మన్ కృష్ణారెడ్డి రైతులకు అన్ని విధాల సహకారాన్ని అందిస్తారని పేర్కొన్నారు. చైర్మన్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ సొసైటీ అభివృద్ధికి పాటు పడతానన్నారు. ఈ కార్యక్రమంలో కేటీడీసీ బ్యాంక్ సూపర్వైజర్ శ్రీనాథ్, సీఈవో మృతుజావలి, వైసిపి మండల నాయకులు టిఎన్ఆర్ నాగరాజు, చౌడయ్య, గోపాలు, చెలిమిల్ల ఎంపిటిసి సురేష్, వెంకటేశ్వర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


చైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేస్తున్న గడ్డం కృష్ణారెడ్డి

సమర సాంస్కృతిక కార్యక్రమాలు విజయవంతం

- సిఐటియు, రైతు సంఘం, వ్యకాసం, ప్రజానాట్యమండలి

- అందరికీ వైద్యం, విద్య, కూడు, గూడు, గుడ్డ అందుబాటులోకి రావాలి : డిఎంహెచ్ఒ


ప్రజాశక్తి - నంద్యాల

బ్రిటీష్ పాలనకు చరమగీతం పడి 77 సంవత్సరాలు కావస్తున్న సందర్భంగా నంద్యాల పట్టణంలోని శ్రీ రామకృష్ణ డిగ్రీ కళాశాలలోని వివేకానంద ఆడిటోరియంలో సిఐటియు, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సమర సాంస్కృతిక కార్యక్రమాలు విజయవంతం అయ్యాయి. ఈ కార్యక్రమానికి సిఐటియు జిల్లా అధ్యక్షులు వి.యేసురత్నం అధ్యక్షత వహించారు. ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు, కళాకారులు, దేశభక్తి గేయాలు, చిన్నపిల్లల ఆటపాటలతో అలరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిఎంహెచ్ఒ డాక్టర్ వెంకటరమణ హాజరై మాట్లాడారు. దేశం మరింత అభివృద్ధి చెందాలంటే ప్రతి ఒక్కరికీ విద్య, వైద్యం, కూడు గూడు, గుడ్డ అందుబాటులోకి రావాలన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల కలలను నెరవేర్చుకోవడం కోసం అందరం కృషి చేయాలన్నారు. అనంతరం సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.నాగరాజు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏ.రాజశేఖర్, జిల్లా అధ్యక్షులు టి.రమేష్ కుమార్‌లు మాట్లాడారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి కార్మికులకు ఉన్న 44 చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా కుదింపు చేసి పెట్టుబడుదారులకు, కార్పొరేట్ సంస్థలకు నయా బానిసలుగా చేస్తుందని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేసి ఉద్యోగులకు ఉద్యోగ భద్రత లేకుండా చేస్తుందని తెలిపారు. ప్రజల సంక్షేమాన్ని మరిచి కార్పొరేట్లకు అప్పనంగా ప్రభుత్వ రంగ సంస్థలను అప్పజెబుతుం దన్నారు. రైతులకు మూడు చట్టాలను తీసుకువచ్చి వెనక్కి తీసుకునే సందర్భంలో ఇచ్చిన హామీలను నేటి వరకు నెరవేర్చక పోవడం దారుణమన్నారు. వ్యవసాయ కార్మికులకు 200 రోజులు పని కల్పించి 600 రూపాయలు రోజువారి కూలి వేతనం ఇవ్వాలని, పట్టణంలో ఉపాధి హామీ పనిని చేపట్టాలని, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని నిరుద్యోగాన్ని నిర్మూలించాలని డిమాండ్ చేశారు. ఇటీవల మణిపూర్లో మహిళలపై దాడులను చేసిన వారిపై చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యం చేయడం దుర్మార్గమని అన్నారు. బిజెపిని, మోడీని దేశం నుండి తరిమివేయాలని, అప్పుడే ప్రతి ఒక్కరికి విద్యా వైద్యం సమపాళ్లలో దొరుకుతుందని, సంపూర్ణ స్వాతంత్రం సాధించిన వాళ్ళమవుతామని అన్నారు. రాబోయే కాలంలో సిఐటియు, రైతు సంఘం, వ్యకాసం, ప్రజానాట్యమండలి చేయ బోయే కార్యక్రమాలలో రైతులు, వ్యవసాయ కార్మికులు, కార్మికులు, మహిళలు, ఉద్యోగులు కలిసి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తోటమద్దులు, జిల్లా కార్యదర్శి వెన్న బాల వెంకట్, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మణ్, కే మహమ్మద్ గౌస్, రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి రామచంద్రుడు, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు షేఖారాణి, నిర్మలమ్మ, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రమణకుమారి, నాయకురాలు నాగమణి, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రామచంద్రుడు, ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వెంకటేశ్వర్లు, నాగరాజు, సిఐటియు నాయకులు ఎల్లయ్య ,భాస్కర్ రెడ్డి, జిల్లా నలుమూలల నుండి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ డాక్టర్ వెంకట రమణ





రెడ్‌క్రాస్ చైర్మన్‌కు అరుదైన పురస్కారం

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

రెడ్ క్రాస్ నంద్యాల జిల్లా చైర్మన్ దస్తగిరి పర్ల ఢిల్లీకి చెందిన కిరణ్ వర్మ ద్వారా 'వాక్ ఫర్ బ్లడ్' పురస్కారాన్ని సోమవారం అందుకున్నారు. ఈ సందర్భంగా దస్తగిరి పర్ల మాట్లాడుతూ వాక్ ఫర్ బ్లడ్ పేరుతో రక్తదానంపై అవగాహన కల్పించాలని దాదాపు 21 వేల కిలోమీటర్ల దేశవ్యాప్త ప్రచార పర్యటనలో భాగంగా గతేడాది నవంబర్ 16న కిరణ్ వర్మ నంద్యాలకు వచ్చారన్నారు. ఆ సమయంలో రెడ్ క్రాస్ సొసైటీ ప్రెసిడెంట్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నంద్యాల జిల్లాలో 8 విద్యా సంస్థలలో 5 వేలకు మందికి పైగా విద్యార్థినీ విద్యార్థులకు కిరణ్ వర్మ రక్తదానంపై అవగాహన కల్పించారని చెప్పారు. నాడు రెడ్‌క్రాస్ నంద్యాల జిల్లా కమిటీ సహకరించినందున నేడు మెమెంటో, మెడల్, ప్రశంసా పత్రం పంపారని తెలిపారు. కిరణ్ వర్మతో రక్తదాన ప్రచార కార్యక్రమం నంద్యాలలో విజయవంతం కావడానికి సహకరించిన వివిధ పాఠశాలల కళాశాలల యాజమాన్యానికి, రెడ్‌క్రాస్ సభ్యులు సద్దాం బ్లడ్, దాద బ్లడ్, జిల్లా కమిటీ సభ్యులకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి నాగేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు నాగ సురేంద్ర, నాగరాజు, యాకోబు, ఉస్మాన్ భాష , మద్దిలేటి, చైతన్య, నంద్యాల మండల సబ్ బ్రాంచ్ అధ్యక్షులు నాగేశ్వర్ రెడ్డి, డిఎఫ్ఒ రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.


కిరణ్ వర్మ పంపిన ప్రశంసాపత్రంను జిల్లా చైర్మన్‌కు అందజేస్తున్న సభ్యులు







భారతదేశం ఆకారంలో విద్యార్థులు


భారతదేశం ఆకారంలో కూర్చున్న విద్యార్థులు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : ప్రైవేటు పాఠశాలల నంద్యాల డివిజన్ అధ్యక్షులు అమీర్ భాష ఆధ్వర్యంలో పట్టణంలోని విశ్వశాంతి హైస్కూల్‌లో కరస్పాండెంట్ శ్రీనాథ్ రెడ్డి సహకారంతో భారతదేశ ముఖచిత్రం ఆకారంలో విద్యార్థులు కూర్చొని 77వ స్వాతంత్య్ర దినోత్సవానికి స్వాగతం పలికారు. అక్షరక్రమంలో కూర్చుని జాతీయ జెండాలు చేత పట్టుకుని నినాదాలు చేశారు. స్వాతంత్ర సమరయోధులను పేరుపేరునా స్మరిస్తూ దేశభక్తితో స్ఫూర్తిగా నిలిచి ఆగస్టు 15న ప్రతి ఇంట జాతీయ జెండా ఎగురవేయాలని కోరారు.

100 అడుగుల జాతీయ జెండాతో భారీ ర్యాలీ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ప్రతి ఒక్కరూ జాతీయ భావానికి విలువ ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి అన్నారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. 100 అడుగుల జాతీయ జెండాతో నంద్యాల మున్సిపల్ కార్యాలయం నుంచి గాంధీ చౌక్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు మున్సిపల్ కార్యాలయం వద్ద జెండా వందనం ఉంటుందని, ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాబున్నిసా, వైస్ చైర్మన్‌లు గంగిశెట్టి శ్రీధర్, పాంషావలి, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది, విద్యాశాఖ అధికారులు, మాజీ కౌన్సిలర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


100 అడుగుల జాతీయ జెండాతో చేపట్టిన ర్యాలీలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్, కమిషనర్, కౌన్సిలర్లు

ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థినులకు నగదు ప్రోత్సాహకం

- కెనరా బ్యాంక్ మేనేజర్ బత్తుల లింగమయ్య


మాట్లాడుతున్న మేనేజర్ బత్తుల లింగమయ్య

ప్రజాశక్తి - రుద్రవరం

విద్యలో ప్రోత్సహించేందుకు ఎస్సీ, ఎస్టీ బాలికలకు నగదు ప్రోత్సాహం అందజేస్తున్నట్లు రుద్రవరం కెనరా బ్యాంక్ మేనేజర్ బత్తుల లింగమయ్య తెలిపారు. సోమవారం స్థానిక బ్యాంకు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కెనరా విద్యా జ్యోతి స్కీమ్‌లో భాగంగా ఆగస్టు 15 స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా రుద్రవరంలోని జడ్పీహెచ్ ఉన్నత పాఠశాలలో ఎస్సీ ఎస్టీ బాలికలు 5, 6, 7వ తరగతుల్లో ముగ్గురు విద్యార్థినిలకు ఒక్కొక్కరికి రూ.2500 చొప్పున రూ.7500 నగదు, 8, 9, 10వ తరగతులకు చెందిన ముగ్గురు విద్యార్థినిలకు ఒక్కొక్కరికి రూ.5 వేలు చొప్పున రూ. 15 వేలు నగదు ప్రోత్సాహం డిడిల ద్వారా అందజేయనున్నట్లు చెప్పారు. ఇలాగే ప్రతి ఏడాది కెనరా బ్యాంక్ జ్యోతి స్కీం ద్వారా తరగతుల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థినులను ఎంపిక చేసి నగదు బహుమతిని అందజేస్తా మన్నారు. కావున విద్యార్థులు మంచి మార్కులు సాధించేందుకు కష్టపడి చదవాలని ఆయన కోరారు.

వర్షాభావంలోనూ రైతులకు సాగునీరు

- ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి

ప్రజాశక్తి - పాణ్యం

వర్షాభావ పరిస్థితుల్లో కూడా రైతులు సుభిక్షంగా వుండాలనే ఆశయంతో రైతులకు సాగు నీరు అందిస్తున్న ఘనత వైసిపి ప్రభుత్వానిదేననినంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. సోమవారం గోరుకల్లు జలాశయంలోకి వస్తున్న నీటికి వారు జలహారతి సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు సంతోషంగా వున్నప్పుడే రాజ్యం సుభిక్షంగా ఉంటుందని, ఇది రైతుల కష్టాలు తెలుసుకొని, వారికి కావలసిన రాయితీలు ఇచ్చే ప్రభుత్వమన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసిపిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు సూర్య నారాయణ రెడ్డి, చందమామ బాబు, కరుణాకర్ రెడ్డి, నారాయణ స్వామి శర్మ, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.


జలహారతి ఇస్తున్న ఎమ్మెల్యే, ఎంపీలు

ఉన్నత పాఠశాలలో బడి ఈడు విద్యార్థిని చేరిక

ప్రజాశక్తి - రుద్రవరం


రుద్రవరంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బడిఈడు విద్యార్థిని సోమవారం బడిలో చేర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుబ్బరాయుడు మాట్లాడుతూ పేరూరు సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ సురేఖ పేరూరు సచివాలయం పరిధిలోని కొండమాయపల్లి గ్రామంలో మునగాల నాగ హరిణి అనే విద్యార్థిని 8వ తరగతిలో బడి మానివేసి ఇంటి దగ్గర ఉండడంతో వెల్ఫేర్ అసిస్టెంట్ గుర్తించి మళ్లీ పాఠశాలలో చేర్పించేందుకు వారి తల్లిదండ్రులతో మాట్లాడి ఒప్పించారని తెలిపారు. దీంతో విద్యార్థిని వయస్సును బట్టి 10వ తరగతిలో చేర్పించామన్నారు. ఎక్కడైనా బడి పిల్లలు చదువు మానుకొని ఇంటి దగ్గర ఉంటే వారిని గుర్తించి బడిలో చేర్పించాలని కోరారు.


బడిఈడు విద్యార్థిని బడిలో చేర్పిస్తున్న పేరూరు వెల్ఫేర్ అసిస్టెంట్ సురేఖ

వ్యవసాయంలో భర్తకు తోడుగా..

ప్రజాశక్తి - రుద్రవరం

కుటుంబ బాధ్యతతో పాటు వ్యవసాయంలో భర్తకు చేదోడు వాదోడుగా ఉంటూ నేను సైతం అంటూ ఓ మహిళా మణి క్రిమిసంహారక మందును పసుపు పంటపై పిచికారి చేస్తూ ఇరుగుపొరుగు వ్యవసాయ దారులకు ఆదర్శప్రాయంగా నిలిచింది. మండల పరిధిలోని తువ్వపల్లె గ్రామానికి చెందిన కౌలు రైతు కాశీం రెడ్డిపల్లి మెట్ట సమీపంలో ఆరు ఎకరాల భూమిని ఎకరాకు మునుగుత్తగా 32 వేలు చెల్లించి కౌలుకు తీసుకొని పసుపు పంటను నాటాడు. అదే పంటలో అంతర్ పంటగా బొప్పాయి పంటను వేశాడు. వ్యవసాయంలో కష్టపడుతున్న తన భర్తకు చేదోడుగా వాదోడుగా ఉండాలనే సంకల్పంతో ఆయన భార్య భూమి మందులను చల్లడంతో పాటు, క్రిమి సంహారక మందులను పిచికారి చేస్తూ తోడుగా నిలుస్తుండడంతో ఇరుగుపొరుగు వ్యవసాయ రైతులు ఆమెను అభినందిస్తున్నారు.


పసుపు పంటలో క్రిమిసంహారక మందును పిచికారి చేస్తున్న మహిళ

సమరయోధుల లక్ష్యం స్వేచ్ఛ, సమానత్వం : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - పాణ్యం

స్వాతంత్ర సమరయోధుల లక్ష్యం స్వేచ్ఛ, సమానత్వం అని ఎస్ఎఫ్ఐ నాయకులు పేర్కొన్నారు. సోమవారం పాణ్యంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో స్వాతంత్ర సమరయోధుల ఫోటోలతో 55 అడుగుల త్రివర్ణ పతాకంతో విద్యార్థులతో కలిసి ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా సహాయకార్యదర్శి బత్తిని ప్రతాప్, వనం వెంకటాద్రి మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్రం వచ్చి 76 సంవత్సరాలు పూర్తయినప్పటికీ స్త్రీలు ఒంటరిగా వెళ్లడానికి తీవ్ర భయానికి గురవుతున్నారని అన్నారు. వైద్య విద్య వ్యవస్థలో కూడా స్వాతంత్రం లేకుండా దోపిడీదారులమయం అయిందన్నారు. బ్రిటీష్ వాళ్లకి ఎదురెళ్లి ఎంతోమంది స్వతంత్ర సమరయోధులు స్వాతంత్రం తీసుకొచ్చింది స్వేచ్ఛ, సమానత్వం కోసం అయితే ఈ కేంద్ర ప్రభుత్వం స్వేచ్ఛ సమానత్వం కాకుండా పూర్తిగా కాషాయీకరణ చేయడానికి పాల్పడుతుందని అన్నారు. బిఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగానికి కూడా రక్షణ లేకుండా పోతుందన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.



అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - చాగలమర్రి

చాగలమర్రి పట్టణం లోని 2వ వార్డులో నివాసముంటున్న రైతు వ్యాపారస్తుడు షరీఫ్(40) అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన షరీఫ్ వ్యవసాయం, జొన్నలు, శనగలు తదితర వ్యవసాయ ధాన్యం వ్యాపారం చేస్తూ జీవనం సాగించేవాడు. ఇటీవల వరుసగా వ్యాపారాలు, వ్యవసాయంలో నష్టం వచ్చి అప్పులు అధికమయ్యాయి. దీంతో దిక్కుతోచని స్థితిలో శనగల మాత్రలను మింగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న స్నేహితులు, కుటుంబీకులు వైద్యం కోసం స్థానిక కేరళ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో నంద్యాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఈ విషయంపై పోలీసులు విచారణ చేపట్టారు.



షరీఫ్ (ఫైల్)

పాఠశాలలో చైర్మన్లతో జెండాను ఎగరవేయండి : డిఇఒ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నేడు స్వాతంత్ర దినోత్సవ వేడుకలలో భాగంగా పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్‌లతో జాతీయ జెండాను అవిష్కరించాలని డిఇఒ కె.సుధాకర్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒక వేళ తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ లేని పక్షంలో సదరు పాఠశాల హెచ్‌ఎం జాతీయ జెండాను ఎగర వేయాలని, ఈ విషయంలో ఉప విద్యా శాఖాధికారులు, మండల విద్యాశాఖాధికారులు తగు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

బెలుం వార్డు మెంబర్ బరిలో ఇద్దరు

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

బెలుం గ్రామ పంచాయితీ 4వ వార్డ్ మెంబర్‌కు ఈ నెల 19వ తేదీన ఎన్నిక జరగనున్నట్లు ఎంపీడీవో ప్రసాద్ రెడ్డి తెలిపారు. ఎంపీడీవో మాట్లాడుతూ 4వ వార్డ్‌కు ఇద్దరు అభ్యర్థులు నామినేషన్ వేయడంతో ఎన్నికలు నిర్వహిస్తునట్లు తెలిపారు. వైసిపి అభ్యర్థి కె.మహేశ్వరి, తెలుగుదేశం అభ్యర్థిగా అభ్యర్థి అమడాల రాములమ్మ బరిలో ఉన్నారని చెప్పారు.

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

మండలంలోని ఆర్.కృష్ణా పురం సమీపంలో ఉన్న శ్రీరామ తీర్థం పుట్టాలమ్మ క్షేత్రాన్ని రాష్ట్ర జలవనరుల సలహా దారులు గంగుల ప్రభాకర్ రెడ్డి, గంగుల ఇందిర దంపతులు సోమవారం సందర్శించారు. వారి రాక సందర్భంగా ఆలయ ఈవో సాయి జయచంద్ర రెడ్డి, ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో కొలువుదీరిన పుట్టాలమ్మ అమ్మవారిని, కొండపైన వెలిసిన యోగానంద నరసింహ స్వామిని, లక్ష్మీదేవి అమ్మవార్లను వారు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అర్చకులు వేదమంత్రాలతో వారిని ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. వారి వెంట వైసిపి నాయకులు గంగుల రామిరెడ్డి తదితరులు ఉన్నారు.



అహోబిలం పంచాయతీ పరిధిలో మఠం జోక్యం తగదు

- కెడిసిసి బ్యాంకు డైరెక్టర్ నాసారి వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

అహోబిలం గ్రామపంచాయతీ పరిధిలో అహెూబిల మఠం వారు జోక్యం చేసుకోవడం తగదని కెడిసిసి బ్యాంకు డైరెక్టర్ నాసారి వెంకటేశ్వర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. సోమవారం అహెూబిలంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అహెూబిలంలో జరిగే పూజా కార్యక్రమాలు, పూజ కైంకర్యాలకు సుప్రీంకోర్టు స్వయం ప్రతిపత్తి ఇచ్చిందని, గ్రామపంచాయతీ పరిధిలో జోక్యం చేసుకోమని చెప్పలేదన్నారు. అహెూబిలం అభివృద్ధి విషయంలో గ్రామస్తులను సంప్రదించకుండా మఠం వారు సొంత నిర్ణయాలు తీసుకుంటున్నారన్నారు. గ్రామపంచాయతీ పరిధిలో మఠం వారు సవాళ్లు పెట్టాలన్న నిర్ణయం తీసుకోవడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. 60 సంవత్సరాల నుండి గంగుల కుటుంబం అహెూబిలం అభివృద్ధికి కృషి చేస్తోందని, గ్రామమంతా వారితో కలిసి అహెూబిలం అభివృద్ధికి పని చేస్తుందని తెలిపారు. సుప్రీంకోర్టు అహోబిల మఠానికి స్వయం ప్రతిపత్తి తీర్పు ఇచ్చాక అహెూబిలం జిపిఎ సంపత్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. అహెూబిలం అభివృద్ధికి కృషి చేస్తున్న నంద్యాల మాజీ ఎంపీ గంగుల ప్రతాపరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే గంగుల నానితోపాటు గ్రామస్తులతో చర్చించాకే అందరి నిర్ణయం మేరకు మఠం వారు ముందుకు సాగాలన్నారు. మఠం అభివృద్ధి కోసం 30 కోట్ల రూపాయల నిధులు ఉన్నాయని, వాటికి మఠం జిపిఎ జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. అహెూబిలం పరిధిలో పేద గిరిజనులు ఉన్నారని, నరసింహస్వామిని నమ్ముకుని అహెూబిలంలో చిన్న చిన్న వ్యాపారాలు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారని, వారి కడుపులు కొట్టే దిశగా జిపిఎ సంపత్ అందరిని ఇబ్బందులకు గురి చేసే పరిస్థితిలో ఉన్నారని విమర్శించారు. ఏదేమైనా గ్రామ పంచాయతీని కాదని మఠం వారు నిర్ణయాలు తీసుకోవడం ఒప్పుకోమన్నారు.



మాట్లాడుతున్న కెడిసిసి బ్యాంకు డైరెక్టర్ నాసారి వెంకటేశ్వర్లు

గడప గడపకు సంక్షేమ ఫలాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

వైసిపి ప్రభుత్వంలో గడప గడపకు సంక్షేమ ఫలాలు అందిస్తున్నామని నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని 38వ వార్డు వైయస్సార్ నగర్‌లో 135వ రోజు వార్డు ఇన్చార్జి టీవీ రమణ, కౌన్సిలర్ సావిత్రమ్మ ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఎమ్మెల్యే ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పార్కులో మొక్కలు పెంపకం, ఇతర సమస్యలను వార్డు ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వాటిని త్వరలో గడపగడపకు ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన నిధుల నుండి పరిష్కరిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అవినీతికి తావు లేకుండా పలు సంక్షేమ పథకాలతో పాటు ప్రజా ప్రయోజనాల కోసం అనేక అభివద్ధి కార్యక్రమాలు అమలు చేస్తూ విశ్వసనీయతకు మారుపేరుగా పాలన సాగిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డికే చెందుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాబున్నిసా, వైసిపి నాయకులు అంకాలయ్య, బాబురావు, నరసింహరావు, తిరుపతయ్య, జాకీర్ హుస్సేన్, అన్వర్ భాష, రామకృష్ణారెడ్డి, ప్రసాద్ రెడ్డి, పుల్లమ్మ, వెంకటస్వామి, ఆచారి, రాము, ఉమాకాంతయ్య, బాబు, చిరు, సోమశేఖర్, శివ, గోరే, ముర్తుజా, చెన్నప్ప, వార్డు సచివాలయ సిబ్బంది, వాలంటరీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి

పెద్ద కందుకూరు సర్పంచి బరిలో ఐదుగురు అభ్యర్థులు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ఆళ్లగడ్డ మండలం కోట కందుకూరు గ్రామ సర్పంచి ఎన్నికల బరిలో ఐదుగురు అభ్యర్థులు ఉన్నట్లు ఎన్నికల అధికారి రామకృష్ణ నాయక్ తెలిపారు. మొత్తం 16 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా సోమవారం 11 మంది అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. బరిలో ఉన్న వారిలో నల్లగట్ల ఇంద్రసేనారెడ్డి, ఆర్ల నాగ శ్రీనివాసులు, అల్లి సాబ్ గారి ముక్తార్ భాష, సుంగల రియాజ్, లక్ష్మీదేవిలు ఉన్నారు.

కనకాద్రిపల్లె సర్పంచిగా శివశంకర్ ఏకగ్రీవం



ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

మండలంలోని కనకాద్రిపల్లి గ్రామంలో జరిగిన సర్పంచి ఉప ఎన్నికల్లో బోయ శివశంకర్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి అన్వర్ హుస్సేన్ సోమవారం తెలిపారు. టిడిపి అభ్యర్థిగా శివశంకర్ ఎంపికయినట్లు గ్రామ నాయకుడు వి.ఆర్ లక్ష్మి రెడ్డి తెలిపారు. ఏకగ్రీవంగా ఎంపికైన బోయ శివశంకర్‌ను గ్రామ నాయకులు, ప్రజలు అభినందించారు.

అంకిరెడ్డి పల్లె 1వ వార్డ్ ఏకగ్రీవం

మండలంలోని అంకిరెడ్డిపల్లె గ్రామంలోని ఒకటో వార్డ్ మెంబర్‌గా ఎన్.ఈశ్వర్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఎన్నికల అధికారులు తెలిపారు. ఎన్నికల అధికారి అబ్దుల్ కలాం ఎన్.ఈశ్వర్ రెడ్డికి ఏకగ్రీవ ఎన్నిక ధ్రువపత్రం అందజేశారు. ఇరు గ్రామాలలో ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసినందున ప్రజలు, పోలీస్ సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రుద్రవరం మండలంలో రెండు వార్డులు ఏకగ్రీవం

- మరొక వార్డుకు బరిలో నిలిచిన అభ్యర్థులు

రుద్రవరం : మండల పరిధిలోని నరసాపురం, ఆర్ నాగులవరం గ్రామాలలో రెండు వార్డు మెంబర్లు ఏకగ్రీవం అయ్యారు. పేరూరు గ్రామంలో వార్డు మెంబర్‌కు అభ్యర్థులు బరిలో నిలిచారు. ఎంపీడీవో మధుసూదనరెడ్డి మాట్లాడుతూ ఈ నెల 19వ తేదీ జరగనున్న వార్డు మెంబర్ ఎన్నికలకు సంబంధించి నరసాపురం గ్రామంలో 10వ వార్డు మెంబర్‌గా కొత్తపల్లి చిన్న ఓలమ్మ, ఆర్ నాగులవరం గ్రామంలో 7వ వార్డు మెంబర్‌గా జి.విష్ణువర్ధన్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని వెల్లడించారు. పేరూరు గ్రామపంచాయతీ 5వ వార్డుకు ఆర్వుగండ్ల లక్ష్మీదేవి, కోతి సుబ్బమ్మ బరిలో నిలిచారని తెలిపారు. పేరూరు గ్రామంలో ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు.

ఉన్నత పాఠశాలలో డిజిటల్ తరగతులు

ప్రజాశక్తి - రుద్రవరం

రుద్రవరంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డిజిటల్ తరగతులు నిర్వహిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయుడు సుబ్బారాయుడు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులకు డిజిటల్ తరగతులు నిర్వహించేందుకు 9 ఐఎఫ్‌పి టీవీలను, 4 స్మార్ట్ టీవీలను పాఠశాలకు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. వీటి ద్వారా డిజిటల్ బోధనను 3వ తరగతి నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులకు చేయనున్నట్లు చెప్పారు. విద్యార్థులు వీటి ద్వారా బోధన చేయడం ద్వారా వారిలో విజ్ఞానం పెరగడంతో పాటు క్లాసులు వినేందుకు ఉత్సాహం ఉంటుందన్నారు. రాబోయే రోజుల్లో పాఠశాలలో మరిన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.



డిజిటల్ తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



చిత్రకారుడు విజయ్ గీసిన భరతమాత చిత్రం

టేకు ఆకుపై భరతమాత చిత్రం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆళ్లగడ్డ పట్టణానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు విజయ్ టేకు ఆకుపై భరతమాత మతరక్కసిని అంతమొందిస్తున్నట్లుగా సోమవారం చిత్రాన్ని గీశారు. ఆయన మాట్లాడుతూ ఒకప్పుడు భారతదేశం తెల్ల దొరలకు వ్యతిరేకంగా క్విట్ ఇండియా నినాదంతో (పోరాటంతో) దేశానికి స్వాతంత్రం వచ్చిందన్నారు. నేడు దేశాన్ని మతరక్కసి కబంధ హస్తాలు కబళించి మణిపూర్ రాష్ట్రం స్వేచ్ఛకు ఆటంకం కలిగిందన్నారు. ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో మతరక్కసి-క్విట్ ఇండియా అంటూ దేశం మరో మారుమారు మ్రోగాలన్నారు.

పిఎన్ఎం జిల్లా నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - నంద్యాల

ప్రజానాట్యమండలి జిల్లా నూతన కమిటీ 13 మందితో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా డాల్ వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా పురుషోత్తం, నాగమని, ప్రధాన కార్యదర్శిగా కోయలకొండ నాగరాజు, సహాయ కార్యదర్శిగా సుధాకర్, జిల్లా కమిటీ సభ్యులుగా వెంకటయ్య, శివ, తులసి, నందిని, శేషు, వీరసేన, చాకలి వెంకటేశ్వర్లు ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కళాకారులు ఆరోగ్యం, బంగారం, బతుకన్న, నిర్మలమ్మ రామచంద్రుడు తదితర కళకారులు పాల్గొన్నారు.



పిఎన్ఎం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలన

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల పట్టణంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నేడు నిర్వహించనున్న 77వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లను సోమవారం జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామున్ పరిశీలించారు. జాతీయ పతాక ఆవిష్కరణ మొదలుకొని కార్యక్రమ ఆద్యంతం వరకు చేస్తున్న ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. వేదిక బ్యాక్ డ్రాప్, పోలీస్ సాయిధ దళాల మార్చ్ ఫాస్ట్, సీటింగ్ అరేంజ్మెంట్, పాఠశాల విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు తదితర ఏర్పాట్లపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. డిఆర్‌డిఏ, డ్వామా, ఎస్సీ కార్పొరేషన్, హౌసింగ్, వ్యవసాయం, స్త్రీ సంక్షేమ శాఖ, గ్రామీణ నీటి సరఫరా, గిరిజన సంక్షేమం, వైద్య ఆరోగ్యం, ఉద్యాన, రవాణా, సూక్ష్మ సేద్యం, సివిల్ సప్లైస్, అగ్నిమాపక తదితర శకటాలను ప్రదర్శించనున్నారు. అలాగే సంబంధిత శాఖలన్నీ కూడా తాము చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలపై చేస్తున్న ఛాయాచిత్ర ప్రదర్శన ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు చేస్తున్న ఏర్పాట్లను డిఆర్వో పుల్లయ్య, ఏఎస్పి వెంకట్రాముడు, సంబంధిత అధికారులు కలెక్టరుకు వివరించారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సాయుధ దళాల మార్చ్ ఫాస్ట్‌ను పరిశీలించే నిమిత్తం ఏర్పాటు చేసిన పరిశీలన వాహనాన్ని కలెక్టర్ పరిశీలించి తగు సూచనలు జారీ చేశారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బి ఎస్ఇ శ్రీధర్ రెడ్డి, డిఆర్‌డిఏ పిడి శ్రీధర్ రెడ్డి, డిఎంహెచ్ఓ వెంకటరమణ, డిఎస్‌పి మహేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ తదితరులు

క్రికెట్ కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి నివాసంలో వైసీపీ నాయకులు కాటసాని ఓబుల్ రెడ్డి క్రీడాకారులకు క్రికెట్ కిట్లను సోమవారం పంపిణీ చేశారు. అవుకు మండలం గుండ్ల శింగవరం, గోకులదిన్నె, కోవెలకుంట్ల మండలం అమడాల, కంపమళ్ళ, సంజామల మండలం రెడ్డిపల్లె గ్రామాలకు చెందిన యువతకు క్రీడలను ప్రోత్సహించడానికి వైసిపి యువ నాయకులు కాటసాని ఓబుల్ రెడ్డి ఉచితంగా క్రికెట్ బ్యాట్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైసిపి మైనారిటీ నాయకుడు ఆత్తార్ జాహీద్ హుస్సేన్, నాయకులు సోముల వెంకటేశ్వర రెడ్డి, ఖానిక్, అత్తార్ అఖిల్ హుస్సేన్, కటికవాని కుంట మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



క్రికెట్ కిట్లను పంపిణీ చేస్తున్న వైసిపి యువ నాయకులు కాటసాని ఓబుల్ రెడ్డి

అమరవీరుల త్యాగ ఫలితమే స్వాతంత్రం : వైసిపి



నాభూమి-నా దేశం లోగోను ఆవిష్కరిస్తున్న వైసిపి రాష్ట్ర కార్యదర్శి గుండం శేషి రెడ్డి

ప్రజాశక్తి - బనగానపల్లె

ఎందరో అమరవీరుల త్యాగ ఫలితమే నేడు మనం అనుభవిస్తున్న స్వాతంత్రమని, అమరవీరుల త్యాగాలు మరువలేనివని వైసిపి రాష్ట్ర కార్యదర్శి గుండం శేషిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని పలుకూరులో నా భూమి-నాదేశం నేల తల్లికి నమస్కారం-వీరులకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జన్మనిచ్చిన తల్లిని, జన్మభూమిని, స్వాతంత్ర సమరయోధులను ఎన్నటికీ మరువరాదన్నారు. నేలతల్లి కలుషితం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ భూపాల్ రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ రామకృష్ణ, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీనివాసులు, సెక్రెటరీ రాజ్యలక్ష్మి, సర్పంచ్ కోనేటి సుమలత, సచివాల సిబ్బంది, సచివాల కన్వీనర్ వడ్డే వెంకటేష్, వాలంటీర్లు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ప్రజా సంక్షేమమే వైసిపి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్ర రెడ్డి అన్నారు. ఆళ్లగడ్డ మున్సిపాలిటీ 2వ సచివాలయం పరిధిలోని 26, 27వ వార్డు దేవరాయపురంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంగుల గ్రామంలోని తూర్పు వీధి, మంగలి వీధి, చాకలి వీధి, ఎస్సీ కాలనీలలో పర్యటించారు. ఎన్నికల ముందు ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను 97 శాతం నెరవేర్చారని, అలాగే సంక్షేమం, అభివృద్ధి జగన్మోహన్ రెడ్డికే సాధ్యమని ప్రజలకు ఇంటింటికి తిరిగి వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు, ఆళ్లగడ్డ ఎంపిపి గజ్జల రాఘవేంద్ర రెడ్డి, ఆళ్లగడ్డ టౌన్ వైఎస్ఆర్సీపీ కన్వీనర్ గొట్లూరు సుధాకర్ రెడ్డి, ఆళ్ళగడ్డ మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ గోపవరం నర్సింహా రెడ్డి, కౌన్సిలర్ వరప్రసాద్ రెడ్డి, నాయకులు శివ నాగిరెడ్డి ,చంద్రా రెడ్డి, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రా రెడ్డి

మహిళలు సమాన అవకాశాలు పొందినప్పుడే నిజమైన స్వాతంత్ర్యం

డాక్టర్ అక్తరుభాను
ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్



నేటి సామాజిక, రాజకీయ మరియు ఆర్థిక మార్పులను గమనిస్తే మహిళలు తమ వ్యక్తిత్వాన్ని కాపాడుకోవడానికి నిరంతరం కృషి చేయాల్సిన ఆవశ్యకత కనబడుతుంది. స్వాతంత్ర్యం అంటే కేవలం రాజకీయ భావన ఒక్కటే కాదు. మహిళలు అన్ని రంగాలలో సమాన అవకాశాలు, గౌరవం పొందగలిగినప్పు డే నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్లు. అనాగరికమైన, అహేతుకమైన అనేక సంకెళ్ళు మహిళల ప్రగతికి అడ్డంకులుగా మారాయి. ఒక స్త్రీ 'శక్తి గా మారి వాటిని జయించి విజేతగా నిలిచి నిజమైన స్వాతంత్ర్య ఫలాలను అనుభవించాలి. స్త్రీ తనకంటూ ఒక విశిష్టతను పొంది తనదైన శైలిలో ప్రతి రంగంలో చరిత్ర సృష్టిస్తూ ముందుకు వెళ్ళాలి. కేవలవం ఒక వ్యక్తిగా కాకుండా ఒక శక్తిగా ముందుకు నడుస్తూ తమ తోటి వాళ్ళను కూడ నడిపిస్తూ స్ఫూర్తి దాయకంగా ఈ స్వాతంత్ర్య వేడుకలు జరుపోకోవాలని ఆశిస్తున్నాను.

సమ సమాజంతోనే అసలైన స్వాతంత్రం : సర్పంచి బాలపీర

ప్రజాశక్తి కర్నూలు క్రైమ్



దేశంలో సమ సమాజం స్థాపించబడినప్పుడే అసలైన స్వాతంత్రం సిద్ధించినట్లని ఈ తాండ్రపాడు సర్పంచి ఎస్ బాలపీర అన్నారు. స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా కేవలం జాతీయ జెండాను ప్రభుత్వం ఎగరేసినంత మాత్రాన సరిపోదుని అన్నారు. దేశంలో ఇన్నేళ్ల స్వాతంత్రంలో నేటికీ కుల,మత, ప్రాంతీయ ఆర్థిక అసమానతలు కొనసాగుతూ ఉండడం గర్హణీయమన్నారు. దేశంలో అందరికీ సమాన అవకాశాలు, మంచి జీవన స్థితి ఉన్నప్పుడే నాటి అమరుల త్యాగానికి సంపూర్ణ సార్థకత చేకూరుతుందన్నారు. బ్రిటిష్ పాలకుల నుంచి విముక్తి మాత్రమే నాటి అమరులు కోరుకోలేదని ఉత్పత్తిలో సంపదలో సమాన వాటా అందాలన్నది వారి అసలైన ఆకాంక్ష అన్నారు. పట్టపగలే నటనడివీధిలో ఆడపిల్లల మానాలకు ప్రాణాలకు భరోసా లేకుండా పోతున్న దుర్ఘటనలు అమృత మహోత్సవం కాలంలో చోటు చేసుకుంటుండడం సిగ్గుచేటని అన్నారు. ప్రభుత్వం మణిపూర్ మహిళలపై సాగిన అమానవీయ ఘటనకు బాధ్యత వహించాలని ఆయన కోరారు. స్వాతంత్ర దినోత్సవ వేడుకల స్ఫూర్తితో ఇలాంటి ఘటనలకు ప్రజలు వ్యతిరేకంగా ఐక్యం కావాలన్నారు.

ఎందరో మహానుభావుల త్యాగఫలం

డాక్టర్ చంద్రశేఖర్
జెమ్‌కేర్ కామినేని హాస్పిటల్, మెడికల్ డైరెక్టర్

ఈ స్వాతంత్ర్య దినోత్సవం నాడు మన స్వాతంత్ర్య సమర యోధుల త్యాగాలను స్మరించుకుంటూ మంచి భవిష్యత్తును నిర్మించు కోవడానికి కృషి చేద్దాం. మన స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన మహాను భావు లకు నా వందనం. వారి ఆశయాల సాధనకోసం అందరం కృషి చేయాలని అన్నారు. దేశ ప్రగతి ప్రతి పౌరుని బాధ్యతగా స్వీకరించాలన్నారు. దేశ ప్రజందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు.



సిల్వర్ జూబ్లీ కళాశాలకు విశిష్ట గుర్తింపు

అనేక మంది ప్రముఖులు ఇక్కడినుండే విద్యాభ్యాసం
మెరుగైన విద్యాబోధన అందించడమే లక్ష్యం
ప్రిన్సిపల్ డాక్టర్ వి.సుబ్రహ్మణ్య కుమార్
ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్



గోల్డెన్ జూబ్లీ ఉత్సవాల్లో రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఐవిఆర్.కృష్ణారావు(ఫైల్)

సిల్వర్ జూబ్లీ కళాశాలకు రాష్ట్రంలోనే ఒక విశిష్ట గుర్తింపు ఉంది. ఈ కళాశాల నుండి విద్యను అభ్యసించిన విద్యార్థులు అనేకమంది ఉన్నత స్థాయి పోస్టులలో ఉన్నారు. ఉత్తమ విద్య బోధన పద్ధతులను పాటిస్తున్నాడంతో సిల్వర్ జూబ్లీ కళాశాల ఎంతో కీర్తి ప్రతిష్టలు సంపాదించుకుంది. ఇటీవలనే ఆ కళాశాల 50 వసంతాల వేడుకలను కూడా ఘనంగా జరుపుకుంది. ఈ వేడుకలకు రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఐవిఆర్.కృష్ణారావు కర్నూలు జిల్లా మాజీ కలెక్టర్ సత్యనారాయణతో పాటు అనేకమంది గ్రూప్ 1 అధికారులు ఈ వేడుకలకు పాల్గొన్నారు. ఈ కళాశాలలో ప్రవేశాలకు ప్రత్యేకంగా రాష్ట్రస్థాయి ఎంట్రెన్స్ టెస్ట్ నిర్వహించి విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తారు. రాష్ట్రస్థాయిలో ఈ కళాశాలలో ప్రవేశాలు పొంది మెరిట్ సాధించిన విద్యార్థులకు మాత్రమే అడ్మిషన్ పొందేందుకు అవకాశం కల్పిస్తారు. మెరిట్ ఆధారంగా ఎంపిక చేసిన విద్యార్థులకు ఉత్తమ విద్యా బోధన పద్ధతులను పాటిస్తూ విద్యాబోధనను అందిస్తున్నారు.



డాక్టర్ బి వి సుబ్రహ్మణ్య కుమార్

మెరుగైన విద్యాబోధన అందించడమే లక్ష్యం
డాక్టర్ బి వి సుబ్రహ్మణ్య కుమార్ కళాశాల ప్రిన్సిపల్

విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించడమే లక్ష్యం. ఇప్పటికే తమ అధ్యాపకులకు ఎప్పటికప్పుడు పలు అంశాలపై అవగాహన కల్పిస్తూ మరింత పకడ్బందీగా విద్యాబోధన అందించేందుకు సలహాలు సూచనలు ఇస్తున్నాం. రాష్ట్రస్థాయిలో తమ కళాశాలకు ప్రత్యేక గుర్తింపు రావడం అభినందనీయం.

ఈ కళాశాల అందిస్తున్న ఉత్తమ విద్యా బోధన విలువలకు గాను ఐఎస్ఒ గుర్తింపు కూడా పొందింది. నాణ్యమైన మెరుగైన విద్యా బోధన పద్ధతులను పాటిస్తుండడంతో ఈ కళాశాల రాష్ట్రస్థాయిలో ఉత్తమ ర్యాంకులను కూడా పొందింది. ఇటీవల క్లస్టర్ యూనివర్సిటీ కిందకు కళాశాలను చేర్చారు. విద్యార్థులకు మరింత బకడ్బందీగా విద్యాబోధన అందించేందుకు జగన్నాథ గట్టు సమీపంలో హాస్టల్ సౌకర్యంతో పాటు తరగతి గదులను కూడా నిర్మాణం చేపట్టారు.



స్వాతంత్ర్య సమర యోధులను స్మరించుకుందాం

నదీమ్, జెమ్ కేర్ కామినేని హాస్పిటల్, జనరల్ మేనేజర్

వ్యాపార నిమిత్తం ఈస్ట్ ఇండియా కంపెనీని స్థాపిస్తమని తెల్లదొరలు 200 సంవత్సరాలు మనల్ని బానిసలు చేసి పాలించారు. ఎందరో స్వాతంత్ర్య సమర యోధుల త్యాగాలే ఈ స్వాతంత్ర్యానికి కారణం. దీనిని అందరూ ఒక పండుగలా జరుపు కోవాలి. మన దేశ అభివృద్ధి కోసం కృషి చేయాలని కోరుకుంటున్నాను.దేశ ప్రజందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు.

ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ ఎక్కడ

-ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2700 పోస్టులు ఖాళీ
-అనేక పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత
-డిఎస్‌సి ద్వారా భర్తీ చేయాలని డిమాండ్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధనకు ఉపాధ్యాయులు లేకపోవడంతో కూన రిల్లుతున్నాయి. పాఠశాలల్లో ఉపా ధ్యాయుల పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తున్నప్పటికీ పట్టించుకోవడం లేదు. వెంటనే డిఎస్‌సి ద్వారా ఈ పోస్టులన్నిటిని భర్తీ చేయాలని నిరుద్యోగులు ప్రభుత్వాన్ని కోరు తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఉన్న పాఠ శాలలకు దాదాపుగా 14618 పోస్టులను మం జూరు కాగా ఇప్పటివరకు పాఠశాలల్లో11916 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. ఇంకా ఉమ్మడి జిల్లాకు దాదాపుగా 2500 ఉపాధ్యాయ పోస్టులు అవసరమవుతాయని విద్యాశాఖ అధికారులు రాష్ట్ర స్థాయి అధికారులకు నివేదించారు. ఉమ్మడి జిల్లాలోని అత్యధికంగా ఆదోని డివిజన్ ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టులు తీవ్ర కొరత ఉన్నాయి. ఈ పోస్టులను భర్తీ చేయకుండా ప్రభుత్వ పాఠశాల విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తామని ప్రభుత్వ పెద్దలు ప్రకటించడం ఎంతవరకు సమంజసం. కర్నూలు జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలోనే అనేక పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కోసిగి కౌతాళం, హాళహర్వి లాంటి మండలాలలోనీ పాఠశాలలో 70 మంది విద్యార్థులకు కేవలం ఒకే ఉపాధ్యాయుడు పనిచేస్తున్నాడు. ఇప్పటికే ఈ ప్రాంతం అక్షరాస్యత శాతంలో వెనుకంజలో నిలిచింది. అత్యధికంగా పాఠశాలలుకు వెళ్లి బడి మానేసిన విద్యార్థుల సంఖ్య కూడా పశ్చిమ ప్రాంతంలోని పాఠశాలల్లోనే ఎక్కువగా కనిపిస్తారు. నాడు నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం గొప్పగా ప్రచారం చేసుకుంటుంది. అనేక ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయకుండా నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తుంది. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను నియమిస్తే బడి బయట ఉండే పిల్లల సంఖ్య తగ్గే అవకాశం ఉంది. అలాంటి చర్యలను తీసుకోవడంలో విద్యాశాఖ విఫలమవుతుంది. వెంటనే జిల్లాలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని నిరుద్యోగ అభ్యర్థులు ప్రభుత్వాన్ని విన్నవించు కుంటున్నారు.

డిఎస్‌సి ద్వారా వెంటనే భర్తీ చేయాలి
కే. సురేష్ కుమార్ రాష్ట్ర సహాధ్యక్షుడు -యుటిఎఫ్

ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి. అం దుకు వెంటనే డిఎస్‌సి ద్వారా ఉపా ధ్యాయ నియా మ కాలను చేపట్టాలి. అ లా ం ట ప్పు డే ప్రభుత్వ పాఠశాల విద్యా వ్యవస్థ మ ం రి ం త బలోపేతం అయ్యే అవకాశం ఉంది.





వినతులు స్వీకరిస్తున్న ఎస్‌పి జి.కృష్ణకాంత్

స్పందన ఫిర్యాదులను త్వరగా పరిష్కరించండి : ఎస్‌పి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

స్పందన కార్యక్రమాల్లో అందిన ఫిర్యాదులపై వేగంగా స్పందించి పరిష్కరించాలని జిల్లా ఎస్‌పి జి.కృష్ణకాంత్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి స్పందన కార్యక్రమానికి వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాది దారులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్పందన కార్యక్రమానికి ఈ రోజు మొత్తం 89 ఫిర్యాదులు వచ్చాయి. స్పందన కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సంధర్భంగా ఎస్‌పి జి. కృష్ణ కాంత్ హామీ ఇచ్చారు. ఈ స్పందన కార్యక్రమంలో డిఎస్‌పి యుగంధర్ బాబు , లీగల్ అడ్వైజర్ మల్లికార్జున రావు, సిఐలు పాల్గొన్నారు.

కర్నూలు వాసి సందీప్ చక్రవర్తికి రాష్ట్రపతి అవార్డు



ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : కర్నూలు జిల్లాకు చెందిన ఐపిఎస్ అధికారి డాక్టర్ జివి.సందీప్ చక్రవర్తి ప్రతిష్టాత్మకమైన రాష్ట్రపతి అవార్డుకు ఎంపికయ్యారు. ఢిల్లీలో జరిగే 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో రాష్ట్రపతి చేతుల మీదుగా ఆయన అవార్డు స్వీకరిస్తారు. ప్రస్తుతం డాక్టర్ జివి.సందీప్ చక్రవర్తి శ్రీనగర్ సిటీలో ఎస్‌పిగా విధులను నిర్వహిస్తున్నారు. ఈయన తండ్రి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఆర్ఎంఒగా డాక్టర్ జివి.రామ్ గోపాల్ విధులను నిర్వహించి రిటైర్డ్ అయ్యారు. ఐదవ సారి రాష్ట్రపతి పోలీస్ మెడల్ ఫర్ గ్యాలరీ అవార్డును అందుకోవడం పట్ల తండ్రి డాక్టర్ జివి.రామ్ గోపాల్ హర్షం వ్యక్తం చేశారు. కర్నూలు జిల్లా వాసికి అత్యుత్తమ పురస్కారం అందుకోవడం పట్ల కూడా పలువురు అభినందనలు తెలిపారు.



ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యేలు , అధికారులు

ఉలిందకొండ వార్డు సభ్యులుగా గుర్రంపోగు లక్ష్మీదేవి ఏకగ్రీవం

సిపిఎం మద్దతుదారులుగా నామినేషన్ వేసిన లక్ష్మీదేవి
ఏకగ్రీవానికి సహకరించిన టిడిపి, వైసిపి నాయకులకు ప్రజలకు ధన్యవాదాలు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కల్లూరు మండలం ఉలిందకొండ గ్రామపంచాయతీ 3వ వార్డుకు ఎన్నికల అధికారులు ఉప ఎన్నిక నిర్వహించారు. వార్డు సభ్యులుగా సిపిఎం, టిడిపి, వైసిపి మద్దతుదారులు ఆరుగురు నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ విత్‌డ్రా చేసుకునేందుకు సోమవారం చివరి రోజు కావడంతో నామినేషన్ వేసిన టిడిపి వైసిపి మద్దతుదారులు తమ నామినేషన్లను ఉప సంహరించుకున్నారు. వార్డు సభ్యులుగా సిపిఎం మద్దతుదారులు గుర్రంపోగు లక్ష్మీదేవి ఒక్క నామినేషన్ ఉండడంతో ఎన్నికల అధికారులు 3వ వార్డు సభ్యురాలు గుర్రం పోగు లక్ష్మీదేవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ప్రకటించారు. అనంతరం ఎన్నికల అధికారులు గుర్రంపోగు లక్ష్మీదేవికి ఎన్నిక ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. ఉలిందకొండ గ్రామంలోని 3 వార్డు ఉప ఎన్నికల్లో సిపిఎం బలపరిచిన అభ్యర్థి గుర్రంపోగు లక్ష్మీదేవి ఏకగ్రీవం. ఉలిందకొండ లో 2021 సిపిఎం అభ్యర్థిగా 3 వార్డుకు పోటీ చేసిన గుర్రంపోగు చిన్న రంగడు గెలుపొందారు. 2022 జనవరిలో ఆయన అనారోగ్యంతో మృతి చెందడంతో ఉప ఎన్నిక నిర్వహించారు. ఈ ఎన్నికల్లో ఆయన భార్య గుర్రంపోగు లక్ష్మీదేవి సిపిఎం మద్దతుదారుగా నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి మధు మాట్లాడుతూ మూడో వార్డు సభ్యురాలుగా గుర్రం పోగు లక్ష్మీదేవి ఏకగ్రీవంగా ఎన్నిక కావడానికి సహకరించిన టిడిపి, వైసిపి నాయకులకు గ్రామ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు.



ఏకగ్రీవంగా ఎన్నికయినట్లు ధ్రువీకరణ పత్రం చూపుతున్న లక్ష్మీదేవి

ఐక్యమత్యాన్ని పెంపొందిస్తాం

-మేరీ మట్టి మేరా దేశ్ స్వాతంత్ర దినోత్సవం
అమృత మహోత్సవంలో ప్రతిజ్ఞ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

మేరీ మట్టి మేరా దేశ్ - స్వాతంత్ర్య దినోత్సవం - అమృతమహోత్సవం భారతీయ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కర్నూలు అర్బన్ ప్రాంతంలోని 6 పాఠశాలల్లో 5-3 అడుగుల స్మారక ఫలకాన్ని ఏర్పాటు చేశారు. ఈ స్మారక ఫలకాలపై ప్రధాని నరేంద్ర మోడీ సందేశం, ఎపి ముఖ్యమంత్రి వైఎస్. జగన మోహన్ రెడ్డి సందేశం, వీరుల పేర్లు ముద్రించబడ్డాయి. మన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను దేశ ప్రజలకు గుర్తు చేసేందుకు ఈ ఫలకాలు ఏర్పాటు చేశారు. ఆవిష్కరణ కార్యక్రమంలో ప్రముఖ నాయకులు పాల్గొని పంచప్రాణ ప్రతిజ్ఞ చేశారు.

ప్రతిజ్ఞ: భారతదేశాన్ని 2047 నాటికి స్వయం ప్రతిపత్తి కల్గిన , అభివృద్ధి చెందిన దేశంగా నిర్మించేందుకు కంటున్నకలలను సాకారం చేస్తాం. బానిస మనస్తత్వాన్ని కూకటి వేళ్లతో పెకలించి వేస్తాం. దేశవారసత్వ సంపదను చూసి గర్విస్తున్నాం. భారతదేశం యొక్క ఐకమత్యాన్ని పెంపొందిస్తాం ,దేశాన్నిరక్షించేవారిని గౌరవిస్తాం. దేశపౌరుడిగా మా కర్తవ్యాన్నినిర్వర్తిస్తాం.అని ప్రతిజ్ఞ చేస్తున్నాం.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, హాఫీజ్‌ఖాన్, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కార్మికుల అక్రమ అరెస్టులను ఖండించండి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

విద్యుత్ కార్మికులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని ప్రజాస్వామ్య వాదులందరూ ఖండించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు కోరారు. విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 17న చలో విజయవాడ ఉండగా సోమవారం నుంచే అరెస్టులు చేయడాన్ని ఆయన ఖండించారు. యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) జిల్లా నాయకులు భీమేష్‌ను ఎమ్మిగనూరులో అరెస్టు చేసి రూరల్ పోలీస్ స్టేషన్లో ఉంచడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఎలక్ట్రిసిటీ ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్ల కోసం ఆందోళన చేస్తుంటే ప్రభుత్వం ఉద్యోగులు, కార్మికులను అరెస్టులు చేసి ఉద్యమాలను అణిచివేయాలని అనుకోవడం సరైనది కాదన్నారు. ప్రజాస్వామ్య దేశంలో తమ నిరసన తెలియజేసే హక్కు ప్రతి ఒక్కరికి ఉందని అన్నారు. ప్రభుత్వం విద్యుత్తు ఉద్యోగుల కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఉద్యోగులు ఆందోళన చేస్తున్నారన్నారు. వారి ఆందోళన చాలా న్యాయమైనదని, సిఐటియు చేస్తున్న పోరాటానికి ఎల్లవేళలా అండ ఉంటుందని తెలిపారు.విద్యుత్ కార్మికులు ఆందోళన చెందకుండా తమ న్యాయమైన డిమాండ్ల కోసం స్ట్రగులు కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా ఆందోళనలో పాలుపంచుకోవాలని కోరారు. ఎమ్మిగనూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఉన్న భీమేష్‌ను సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి అంజిబాబు, ఎమ్మిగనూరు సిఐటియు నాయకులు సి.గోవిందు, రాముడు రైతు సంఘం నాయకుడు హనుమంతు పరామర్శించారు.



సిఐటియు జిల్లా కార్యదర్శి అంజిబాబును గృహనిర్బంధం చేసిన పోలీసులు

సిపిఎం పట్టణ కార్యదర్శి రాజశేఖర్ తండ్రి మృతి

ప్రజాశక్తి-గూడూరు

గూడూరు స్థానిక సిపిఎం పట్టణ కార్యదర్శి కె. రాజశేఖర్ తండ్రి కె.కేశన్న(90)ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న సిపిఎం మండల కార్యదర్శి జె. మోహన్ ఆటో వర్కర్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె. ప్రభాకర్ , సిఐటియు గూడూరు మండల అధ్యక్షుడు గుండప్ప కేశన్న భౌతిక కాయం వద్ద పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రవి, సిపిఎం నాయకులు రంగన్న, సోమలింగడు, దానమన్న, కె.రాజు, మున్సిపల్ కార్మికులు శాంతన్న, తదితరులు పాల్గొన్నారు.



నివాళ్లు అర్పిస్తున్న నాయకులు



ఫుట్‌బాల్ జట్టుకు ఎంపికయిన క్రీడాకారులతో కోచ్, తదితరులు

జిల్లా ఫుట్‌బాల్ జట్టు ఎంపిక

ప్రజాశక్తి-కర్నూలు స్పోర్ట్స్

కర్నూలు జిల్లా జట్టు ఎంపకకు రెండు వారాలపాటు స్థానిక ఔట్ డోర్ స్టేడియంలో శిక్షణ శిబిరం నిర్వహించారని జిల్లా ఫుట్ బాల్ కార్యదర్శి వై.శ్రీనివాసులు , ఫుట్ బాల్ అండర్ -14 శిక్షణ సిబిరం అనంతరం తుది జట్టును ఎంపిక చేసినట్టు ఈ కార్యక్రమంలో ఫుట్ బాల్ జిల్లా సెక్రటరీ వై. శ్రీనివాసులు ఎంపికైన జిల్లా క్రీడాకారులను ప్రకటించారు. ఈ నెల 16న కడపలో జరిగే జోనల్ స్థాయి ఫుట్ బాల్ పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు. అదేవిధంగా క్రీడాకారులకు క్రీడా దుస్తులు జెర్సీ షాట్లు అందించిన రాకేష్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో టీంకోచ్ బ్రహ్మకుమార్ సాయి హాస్టల్ కోచ్ చంద్రశేఖర్, లక్ష్మీదేవి, మల్లి, నారాయణ, హర్ష పాల్గొన్నారు. **జట్టు వివరాలు:** భవి(captain), ఆదిల్ ,ఉమేష్, సూర్య, రోహిత్, రిషికేష్, ప్రవీణ్, సుహాన్, జస్వంత్ ,శ్యామ్, అబ్దుల్, వాజిత్, ప్రజ్వల్, నరేంద్ర, చౌలరాజు, అజయ్, జస్సు, అభి

గడియారం హాస్పిటల్ సమస్యలను పరిష్కరించండి

కలెక్టర్‌కు ఆవాజ్ కమిటీ వినతి

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్ : కర్నూలు నగరంలోని మొట్టమొదటి ప్రభుత్వ హాస్పిటల్ అయిన గడియారం హాస్పిటల్ డాక్టర్లను, వైద్య సిబ్బందిని నియమించి , మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆవాజ్ కమిటీ నగర అధ్యక్ష కార్యదర్శులు ఇక్బల్ హుస్సేన్ ,మొహమ్మద్ షరీఫ్ నాయకత్వంలో సోమవారం స్పందనలో కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. వారు ఈసందర్భంగా మాట్లాడుతూ గత 100 యేళ్ల పైబడి కన్నులకు, వైద్యం అందించడంలో గడియారం హాస్పిటల్ ప్రఖ్యాతి గాంచిందన్నారు. కర్నూలులోని సగం జనాభాకు పైగా ఇక్కడే జన్మించారంటే అతిశయోక్తి కాదని తెలిపారు. కర్నూలు నగరంలోని, చుట్టూ ప్రక్కల గ్రామాల నుండి ఎద్దుల బండ్లు కట్టుకొని వచ్చి, ఇక్కడే కాన్పులు చేసుకునే వారని, అటువంటి ఈ గడియారం హాస్పిటల్‌లో డాక్టర్లు, సిబ్బంది, మౌలిక వసతులు లేవన్నారు. గడియారం హాస్పిటల్ అభివృద్ధి కోసం అనేక మార్లు ప్రభుత్వ అధికారులకు, ప్రజాప్రతినిధులకు, నగరపాలక సంస్థ కమిషనర్ కు, ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా, ఫలితం లేదని ఎక్కడి సమస్య అక్కడే ఉందని, పరిష్కారం కావడం లేదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. వైసిపి ప్రభుత్వానికి పేద, బడుగు, బలహీన వర్గాల ముస్లిం మైనార్టీల, ఆరోగ్యాల పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్న తక్షణమే గడియారం హాస్పిటల్‌లో గైనిక్ సీనియర్ డాక్టర్లు సిబ్బందిని నియమించిందన్నారు. మౌలిక వసతులు కల్పిం చాలని వారు డిమాండ్ చేశారు. ఓల్డ్ టౌన్‌లోని దాదాపు 14 వార్డుల పేద ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్మికులు ప్రతిరోజు గడియారం హాస్పిటల్ అడ్డాగా 500 మందికి పైగా మట్టిపనిచేస్తూ జీవిస్తున్నారని, అటువంటి వారికి ఏదైనా గాయాలు తగిలిన, జ్వరం, జలుబు లాంటి చిన్నపాటి రోగాలు వచ్చిన, చూపించుకోవడానికి, ఇక్కడ ఎవరు దిక్కులేరని, కనీసం టీంచర్, బ్యాండేడ్ కట్టేవారు కూడా దిక్కులేరని, హాలోపతి డిస్పెన్సరీలో మేల్, ఫిమేల్ డాక్టర్లను నియమించాలన్నారు. ముగ్గురు ఎఎన్ఎం లను ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, మౌలిక వసతులు కల్పించాలని, ఆవాజ్ కమిటీ బృందం ఈ సందర్భంగా కలెక్టర్‌ను కోరింది. స్పందించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన మాట్లాడుతూ గడియారం హాస్పిటల్‌లో విజిట్ చేసి డాక్టర్ల , సిబ్బందిని నియమిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్ కమిటీ నగర నాయకులు షేక్ అబ్దుల్ నయీమ్, సయ్యద్ అహ్మద్ ,చోటు భాయ్, మహబూబ్ బాషా ,గోరాబాషా, సాబీర్ బాషా, గఫార్ బాషా బాయ్, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న ఆవాజ్ కమిటీ నాయకులు

విద్యార్థి దశ నుంచే నైతిక విలువలుండాలి

పత్తికొండ డిఎస్‌పి శ్రీనివాసులు రెడ్డి

ప్రజాశక్తి-పత్తికొండ

విద్యార్థి దశ నుంచి నైతిక విలువలను పెంపొందించుకోవాలని పత్తికొండ డిఎస్‌పి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పత్తికొండ పట్టణంలోని ఎంపిపి స్కూలులో కెపిఆర్ మైత్రి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు రామ్మోహన్ ఆధ్వర్యంలో 76వ స్వతంత్ర దినోత్సవం పురస్కరించుకొని విద్యార్థులకు డిఎస్‌పి చేతులమీదుగా పుస్తకాల పంపిణీ చేయించారు. డిఎస్‌పి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, ఉన్నత శిఖరాలను అది రోధించాలని అన్నారు. విద్యార్థి దశ నుంచి సత్ర వర్తన, క్రమశిక్షణ నైపుణ్యం, పట్టుదల పెంపొందించు



మాట్లాడుతున్న పత్తికొండ డిఎస్‌పి శ్రీనివాసులు రెడ్డి

కోవాలని అన్నారు. స్వతంత్ర పోరాటాలలో మహాత్మాగాంధీ , జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్ మరెందరో మహనీయులు ప్రాణత్యాగాలను చేశారన్నారు. వారిని స్ఫూర్తిగా చేసుకొని దేశభక్తిని అలవర్చు కోవాలన్నారు. పత్తికొండ మాజీ సర్పంచి సోమశేఖర్, డాక్యుమెంట్ రైటర్ నాగేంద్ర స్కూల్ హెడ్మాస్టర్ బేబీ నిర్మల, టీచర్లు మాధవి లత, వీణ, ప్రశాంతి, పద్మలత ,తదితరులు పాల్గొన్నారు

ఆర్ అండ్ బి రోడ్డుకు మరమ్మతులు చేయండి : సిపిఎం

ప్రజాశక్తి-పత్తికొండ

పత్తికొండ గుత్తి ప్రధాన రహదారి ఎర్రగుడి రోడ్డులో రోడ్డుకు మరమ్మతులు చేయాలని కోరుతూ సోమవారం పత్తికొండ ఆర్అండ్‌బి అధికారులకు సిపిఎం మండల కార్యదర్శి శ్రీరాములు, మండల కమిటీ సభ్యులు కొండారెడ్డి, ప్రతాప్ అధికారులకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుత్తి, పత్తికొండ రహదారి నిత్యం బిజీగా ఉండే రోడ్డు అని, అలాంటి రోడ్డు దగ్గర గుంతల మయమై పోయినప్పటికీ ఆర్అండ్‌బి అధికారులు ఇంతవరకు మరమ్మతులు చేయలేదన్నారు. మరమ్మతులు చేయకపోవడం వల్ల వాహనదారులు తీవ్ర ఆందోళనకు గురి అవుతున్నారు అన్నారు. రాత్రి వేళల్లో గుంతలు కనపడక ప్రమాదాలు కూడా జరిగిన సంఘటనలు అనేకం ఉన్నాయన్నారు. ఆర్అండ్‌బి అధికారులకు పలుమార్లు చెప్పినప్పటికీ వారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి గుంతలమై మైన ఎర్రగుడి రోడ్డును తక్షణమే మరమ్మతులు చేయించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఈశ్వరప్ప, గ్రామస్తులు పాల్గొన్నారు.



సంబంధిత అధికారికి వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు శ్రీరాములు , తదితరులు

మహిళల రక్షణే ధ్యేయం

వారికి అండగా దిశ యాప్
అవగాహన పెంపొందించడానికి సదస్సులు
దిశ డిఎస్‌పి సుధాకర్ రెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్



మహిళలకు అన్ని విధాల రక్షణను అందించడమే తమ ధ్యేయమని దిశా మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్‌పి ఐ.సుధాకర్ రెడ్డి అన్నారు. స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించు కుని ప్రజాశక్తి ఆయనను పలకరించింది. ఈమెరకు ఆయన స్పందిస్తూ.... అనేక మంది వీరుల త్యాగ ఫలిత మే భారత దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిందని అన్నారు. రెండు వందల ఏళ్లుగా బ్రిటీష్ సామ్రాజ్యం కబంధహస్తాల్లో. దేశం నలిగిపోయిందన్నారు. నాటి వీరుల త్యాగ ఫలితమే నేడు స్వాతంత్ర్యాన్ని భారతావని అనుభవిస్తోందన్నారు. ఈ పోరాటంలో మహిళలు పాత్ర ఎనలేనిది అన్నారు. సమాజంలో నేటికీ మహిళా వివక్షత కొనసాగుతుండడం దురదృష్టకరమన్నారు. మహిళలకు రక్షణగా అండగా నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం దిశ యాప్‌ను ప్రవేశపెట్టిందని అన్నారు. మహిళలపై ఎక్కడ ఇలాంటి నేరాలు జరిగినా అతి తక్కువ సమయంలో నిరోధించేందుకు దిశయాప్ ఉపయోగపడుతుందన్నారు. మహిళలపై వేధింపులు, బాల్యవివాహాలు, యాసిడ్ దాడులు కిడ్నాప్‌లు, అవమానించడం, దాడులకు పాల్పడడం గృహహింస, వరకట్న వేధింపులు అత్యాచారం వంటి నేరాలే కాకుండా మహిళల హక్కులకు భంగం కలిగించే ఏ విధమైన నేరాలకు పాల్పడినా చర్యలు తీసుకుంటామన్నారు. వీటిని నిరోధించడానికి దిశ యాప్ వినియోగంపై అవగాహన కల్పించడం వారి మొబైల్‌లో యాప్‌ను రిజిస్టర్ చేయడం వంటి అనేక కార్యక్రమాలు ఇప్పటికే చేపట్టామని అన్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు 88 కేసులు నమోదయ్యాయని అన్నారు. కుటుంబ కలహాలు, గృహహింస కేసులు అత్యధికంగా ఉంటున్నాయన్నారు. భార్యాభర్త కలహాలు తరచుగా స్టేషన్‌కు వస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో ఇరువురిని కూర్చోబెట్టి కౌన్సిలింగ్ నిర్వహించి సమస్యను పరిష్కరించ డానికి కృషి చేస్తు న్నామని చెప్పారు. సమస్య తీవ్రతను బట్టి కేసులు నమోదు చేస్తున్నాం. భార్యాభర్తలు ఒకరినొకరు అర్థం చేసుకొని జీవించాలని వ్యక్తిగత అహాన్ని ప్రదర్శించుకోకూడదని చెప్పారు. మహిళలపై సాగుతున్న నేరాలకు ప్రధానంగా సెల్ ఫోన్లు కూడా సోషల్ మీడియా ద్వారా పెద్ద ఎత్తున ప్రభావం చూపుతున్నా యన్నారు. సోషల్ మీడియా సెల్ ఫోన్లను అభివృద్ధి కోసం మాత్రమే వినియోగించాలని కోరారు. మహిళలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని చెప్పారు.

అపరిశుభ్రంగా దేశనేతల విగ్రహాలు

మరమ్మతులకు నోచని గాంధీ, అంబేద్కర్ విగ్రహాలు
చిత్తశుద్ధి లోపించిన పాలకులు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్



అంబేద్కర్ విగ్రహం వద్ద పగుళ్లు చూపుతున్న నేతలు

స్వాతంత్ర దినోత్సవ వేడుకలు కొన్ని గంటల్లో ప్రారంభం కాబోతున్నాయి. కానీ నగరంలో అంబేద్కర్, గాంధీ విగ్రహాల చుట్టూ బండలు కదిలిపోయి. శిథిలావస్థలో ఉన్నా మరమ్మతులు చేయకపోగా కనీసం చెత్తను కూడా తొలగించే దిక్కు లేని పరిస్థితి ఏర్పడిందని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఇరిగినేని పుల్లారెడ్డి, నగర నాయకులు ఎం.నాగరాజు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధి మద్దిలేటి ఆవేదన వ్యక్తపరిచారు. సోమవారం పట్టణ పౌర సంక్షేమ సంఘం ప్రతినిధి బృందం నగరంలో పర్యటించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని ప్రజాప్రతిథులందరూ పాల్గొనే జడ్‌పి సమావేశ భవనం పక్కనున్న గాంధీ విగ్రహం ఎదుట చెత్తను కూడా తొలగించ లేదన్నారు. అక్కడ ఉండే చిరు వ్యాపారి తనను ఎవరైనా ప్రశ్నిస్తారేమోనని సొంత ఖర్చులతో ఆ ప్రాంతాన్ని అంతా శుభ్రం చేయించాడు. కలెక్టరేట్, జిల్లా పరిషత్ ఎదుట ఉన్న గాంధీ విగ్రహాలు , పాత బస్టాండులోని అంబేద్కర్ విగ్రహాల చుట్టూ ఉన్న గోడలు మెట్లు శిథిలావస్థకు చేరి పాములు తేళ్లకు నిలయంగా మారాయని విమర్శించారు. ప్రతి సందర్భంలో అధికారులు అధికార పార్టీలు అభిమానించే విగ్రహాలపై చూపుతున్న శ్రద్ధ జాతిపిత మహాత్మాగాంధీ, రాజ్యాంగ కర్త బిఆర్.అంబేద్కర్ విగ్రహాలపై చూపకపోవడం క్షమించరాని విషయమన్నారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని గాంధీ అంబేద్కర్ విగ్రహాలపై నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై చర్యలు తీసుకొని వెంటనే మరమ్మతులు చేయించాలని కోరారు. ఈ ప్రతినిధి బృందంలో ఎస్.షమీ ఉల్లా, కె.శ్రీనివాసులు, ఎన్.మద్దిలేటి, ఎస్. శాకీర్ పాల్గొన్నారు.

అత్యధిక ప్లేస్‌మెంట్స్ కల్పించే కేంద్రగా 'సేయింట్ జోసఫ్'

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలులోని సుంకేసుల రోడ్‌లోని సేయింట్ జోసఫ్ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు అత్యధిక ప్యాకేజీతో అనేక జాతీయ , బహుళజాతి కంపెనీలు క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ద్వారా అభ్యర్థుల ఎంపిక జరుగుతోంది. 1994వ సంవత్సరంలో కళాశాల ప్రిన్సిపాల్ వై.శౌరీలు రెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభించారు. అనతికాలంలోనే రాష్ట్రంలో టాప్ పది కళాశాలల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. ప్రతి ఏటా 50 శాతం పైగా విద్యార్థులు ఉన్నత కంపెనీలకు ఎంపికవుతున్నారు. 30శాతం మంది విద్యార్థులు డిగ్రీ తదనంతర ఉన్నత విద్యకు 20 శాతం మంది విద్యార్థులు స్థానికంగా ఉద్యోగ అవకాశలను పొందుతున్నారు. గత సంవత్సరకాలంలో ప్లేస్‌మెంట్స్ ద్వారా ఎంపికైన వివరాలను కళాశాల వైస్ ప్రిన్సిపాల్ , ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ సివి.వెంకట్ సత్యనారాయణ వివరించారు. వివిధ టాప్ కంపెనీలు యాక్సెంచర్ లో 42 మంది, టిసిఎస్‌లో 26 మంది, విప్రో లో 20 మంది, హెటెరో లో 37 మంది, ఇనిస్టిట్యూట్ ఫర్ లాంగ్వేజ్ మేనేజ్‌మెంట్ లో 40మంది, ఆధ్యా ఆర్గానిక్స్‌లో ముగ్గురు, టాటా క్యాపిటల్ ఆరుగురు, రాంకో సిమెంట్ లో ముగ్గురు, ఐసిఐసిఐలో 11 మంది, ఎస్‌బిఐ లైఫ్ లో నలుగురు, ఇండియన్ ఇమ్యూనో బయోలాజికల్ కంపెనీలో యూజీ కోర్సు విద్యార్థులు 19 మంది, పీజీ కోర్స్ విద్యార్థులు ఆరుగురు, డాక్టర్ రెడ్డీస్‌కు 13 మంది ఎంపికయ్యారన్నారు. ఇందులో బిఎస్‌సిలో అత్యధిక ప్యాకేజి రూ.3.9లక్షలు, బీకాంలో రూ.2.8 లక్షలు, లైఫ్ సైన్స్ కోర్సుల్లో రూ.2.4 లక్షలు ఇలా అత్యధిక ప్యాకేజీలతో రిక్రూట్ అయ్యారని అన్నారు. విద్యార్థుల ప్లేస్‌మెంట్ డ్రైవ్, ఇడిసెల్‌ను అభివృద్ధి చేయడం, ఇండస్ట్రీస్‌లో విద్యార్థులను ఫీల్డ్ ట్రిప్స్‌కు పంపడం, గుర్తింపు పొందిన పారిశ్రామికవేత్తలతో ఇంట్రాక్ట్ ప్రోగ్రాం నిర్వహించడం, ఇంటర్సిటీ ప్రాధాన్యత వంటి అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.



సేంట్ జోసెఫ్స్ కళాశాల


Ms. Y Showrilu Reddy


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న నిపుణులు